ఆదివారం ప్రత్యేకం

మనకూ ఒకరోజు కావాలి.. మన నచ్చినట్టు ఉండాలి.. పదిమందితో కలిసి ఆనందంగా గడపాలి.. గంతులు వేయాలి.. ఆటలు ఆడాలి.. పాటలు పాడాలి.. డ్యాన్స్ చేయాలి.. ఆ రోజంతా ఖాళీగా గడపాలి.. ఇలా ఏడాదికి ఓ రోజు.. చాలు ఏడాదంతా జ్ఞాపకం చేసుకుంటూ బతికేస్తాం.. ఇదీ ప్రస్తుత తరం ఆలోచన. ఎందుకంటే బిజీ జీవితం.. తీవ్ర ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు.. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకూ పరుగులే.. ఎక్కడా ఖాళీ ఉండదు.. సాయంత్రానికి ఖాళీగా కూర్చుని ఆలోచిస్తే ఇంతేనా జీవితం అనిపిస్తుంది.. ఎందుకంటే ప్రస్తుతం ఉమ్మడిగా చేసుకునే పండుగల్లేవ్.. సరదాగా కలుసుకునే సందర్భాల్లేవ్.. వచ్చామా.. వెళ్లామా అంతే.. అందుకే కార్తీక మాసం సందర్భంగా ఏడాదికో మారు పిక్నిక్ పెట్టుకుంటున్నారు.. కుటుంబీకులు, స్నేహితులు కలిసి రీఫ్రెష్ అవుతున్నారు.. మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాల అని ముత్యాల ముగ్గు సినిమాలో రావుగోపాలరావు అన్నట్టు.. ఆ రోజంతా తమ కళాపోషణ బయటపెడుతున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపి బై బై చెప్పుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.. ఆనందంగా గడిపేందుకు మనకు ఎన్నెన్నో అందమైన పిక్నిక్ స్పాట్‌లు ఉన్నాయి.. అవేంటో ఒకసారి చూసేద్దాం!




అంతర్వేది



ఆంధ్రా కేరళ కోనసీమ

పచ్చని అందాలకు నెలవు కోనసీమ.. ఎటుచూసినా పచ్చదనమే.. ఏవైపు చూసినా పిక్నిక్ స్పాట్‌గానే ఉంటుంది.. ఎందుకంటే ఆంధ్రా కేరళ.. ఎత్తయిన కొబ్బరిచెట్లు.. పచ్చదనంతో నిండిన చేల మధ్య నుంచి నల్లటి తారు రోడ్లపై వెళుతుంటే ఆ అనుభూతే వేరు.. కేశవదాసుపాలెం, కేశనపల్లి, ఓడలరేవు, వాసలతిప్ప, ఎస్.యానాం బీచ్‌లతో పాటు గోదావరి తీరప్రాంతాలైన యానాం, కోటిపల్లి, ముక్తేశ్వరం, అదుర్రు, సోంపల్లి, దిండి రిసార్ట్స్, లొల్లలాకులు తదితర ప్రాంతాలు పిక్నిక్ స్పాట్‌లుగా ప్రసిద్ధికెక్కాయి. వీటితోపాటు ఆధ్యాత్మిక ప్రాంతాలైన అంతర్వేది, అప్పనపల్లి, అయినవిల్లి, మురమళ్ళ, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. కోనసీమకు ఓవైపు గోదావరి.. మరో వైపు బీచ్ ఉండడం గమనార్హం. కోనసీమకు వెళ్లేందుకు రావులపాలెం, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మీదుగా బస్ సౌకర్యం ఉంది. రావులపాలెం మీదుగా అంతర్వేదికి 65 కి.మీ. ఓడలరేవు అయితే 51 కి.మీ.. పాలకొల్లు నుంచి అంతర్వేది అయితే 26 కి.మీ ఉంటుంది.





తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో శనివారం మహిళల పిక్నిక్ సందడి

'తూర్పు'న అందాలు

అన్ని అందాలు కలగలిపినదే తూర్పుగోదావరి జిల్లా.. ఒకవైపు గోదావరి.. మరోవైపు కడియం పూలతోటలు.. ఇంకోవైపు కోరుకొండలో పాండవుల మెట్ట.. గోకవరంలో సూదికొండ.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కాటన్‌మ్యూజియం, గోదావరి అందాలు.. పెరవలి మండలం తీపర్రు గోదావరి చెంతనే ఇసుక తిన్నెలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నోఎన్నెన్నో.. ఇక రాజమహేంద్రవరం పట్టణవాసులకు అయితే నగరంలో దివాన్‌చెరువు వద్ద ఉన్న పుష్కరవనం.. లోపలకు వెళితే మళ్లీ రావాలనిపించదు. ఎందుకంటే చుట్టూ చెట్ల మధ్యన పిక్నిక్ అద్భుతం.. బిజీ జీవితం గడిపే పట్టణవాసులకు ఈ పుష్కరవనం ప్రత్యేకమనే చెప్పాలి. ఎందుకంటే ఒకటా రెండా సుమారు 250 ఎకరాలపైనే ఈ పార్కు విస్తీర్ణం. ఒక 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలు ఉంటాయి. తరువాత ఎటు చూసినా పచ్చనిచెట్లు గుబురుగా గుబురుగా పెరిగి ఉంటాయి. తూర్పుగోదావరి జిల్లాలో పిక్నిక్ స్పాట్లకు రాజమహేంద్రవరం నగరం నుంచి ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఉంది.. ఇక రాజమహేంద్రవరం రావడానికి విమానయానం, రైలు, బస్ తదితర సదుపాయాలు ఉన్నాయి.



రారండోయ్.. చూసొద్దాం!

ఉమ్మడి జిల్లాలో ఎన్నెన్నో అందాలు

(కాకినాడ/ అమలాపురం/ రాజమహేంద్రవరం సిటీ/ దివాన్‌చెరువు/ కడియం/పెరవలి, ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పిక్నిక్‌ల సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో ఎక్కడికక్కడ జనం గార్డెన్ పార్టీలతో సందడి చేస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు, వివిధ సామాజికవర్గాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ యూనియన్లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు ఎవరికివారే పిక్నిక్‌ల బాటపడుతున్నారు. ఆదివారం రోజైతే ఉమ్మడి జిల్లాలో మామిడి, కొబ్బరి తోటలు, గోదావరి గట్లు, పార్కులు పిక్నిక్‌లతో సందడిగా మారుతున్నాయి. కాకినాడలో అయితే సర్పవరం జంక్షన్, ఇంద్ర పాలెం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తునిరూరల్‌లోని అనేక ప్రైవేటు గార్డెన్లు, గెస్ట్‌హౌస్‌లు, కొబ్బరితోటల్లో పిక్నిక్‌లు భారీగా జరుగు తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం తదితర ప్రాంతాల్లో తోటలు, నర్సరీలు గోదావరి ఇసుక తిన్నెలు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరితోటలు, సముద్రతీరం వెంబడి, గోదావరి పాయల వెంబడి ఇసుక మధ్యలో సరదాసరదాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సామాజికవర్గాల వారీగా నిర్వహించే పిక్నిక్‌లు అయితే ఓ భారీ ఈవెంట్‌నే తలపిస్తాయి. డీజేలు, సినిమా నటులతో డ్యాన్సులు, స్థానిక కళాకారులతో స్టెప్పులు, ఆటపాటలతో సందడి చేస్తారు. ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలో కొన్ని సామాజికవర్గాలు రెండు వారాలుగా భారీస్థాయిలో వీటిని నిర్వహిస్తున్నాయి. కాకినాడలో ఓ కీలక సామాజికవర్గ పిక్నిక్‌లో ఆటపాటల్లో గెలిచినవారికి కారు, బైక్‌లు కూడా గిఫ్టులుగా అందిస్తున్నారు. మిమిక్రీ, కామెడీ పండించే కళాకారులను సైతం పిలిపిస్తున్నారు. కోనసీమ జిల్లాలో తోటల్లో నిర్వహిస్తోన్న పిక్నిక్‌ల్లో సరదాగా కార్డులతోపాటు ఉత్తుత్తి కోడిపందేలు నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పిక్నిక్‌ల సందడి హోరెత్తిస్తోంది. మరోపక్క కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, శంఖవరం మండలాలు, యానాం వద్ద గోదావరి అందాలు, ఏజెన్సీలో మారేడుమిల్లి, చింతూరు, రంపచోడవరం తదితర ప్రాంతాల్లో జలపాతాల వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు వాటర్‌ఫాల్స్ మరింత శోభాయమానంగా మారి పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి.

హరితవనం.. కడియం



కడియం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మనం ఒకటి రెండు రకాలు పూలు చూస్తేనే ముచ్చట పడిపోతాం.. అటువంటిది వందలాది రకాల పూలమొక్కలు విరబూస్తూ ఓ చోట కనిపిస్తే ఆ సుందర దృశ్యం చూడతరమా.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో నర్సరీల పూలకొలువు. మండలంలో పది గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో 1100 నర్సరీలు ఉన్నాయి. ఇక్కడ పూలు, పండ్లు, ఆర్నమెంటల్, ఔషధ, సెమిషేడ్, క్రీపర్, ఇండోర్, ఔట్‌డోర్, హేంగింగ్ వంటి రకాల మొక్కలు అనేకం ఉంటాయి. కార్మికుల శ్రమ సౌందర్యంతో విరజిల్లే మొక్కలు ఆకుపచ్చని విన్యాసం చేస్తూ పర్యాటకులకు ప్రణమిల్లుతాయి. ప్రకృతి ఒడిలో హరిత శోభగా గోదావరి నదిఒడ్డున వెలసిన కడియం పూలసీమలో ఈ కార్తీక వేళ సేదతీరి ఉసిరిచెట్టు కింద సహపంక్తి వన భోజనాలు చేయడానికి అనేక మంది ఇష్టపడతారు. కడియపులంక జాతీయ రహదారిని అనుకుని ఉంటుంది. రాజమహేంద్రవరం నుంచి 13 కి.మీ ప్రయాణం చేస్తే కడియం చేరుకోవచ్చు. రావులపాలెం మీదుగా అయితే 23 కి.మీ ఉంటుంది. నిరంతరం బస్, ఆటోలు ఉంటాయి.



ఆహా.. ఏమి రుచి..అనరా..

పిక్నిక్ అంటే విందు కీలకం. వెజ్, నాన్‌వెజ్ భోజనాల్లో రకరకాల కమ్మటి వంటలు వేడివేడిగా తినడం అదో ఆనందం. ఈ నేపథ్యంలో పిక్నిక్‌లకు కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలలో కొన్ని హోటళ్లకు భారీ వెజ్, నాన్‌వెజ్ భోజనాల ఆర్డర్లు వస్తున్నాయి. కాకినాడలో ఓ ప్రముఖ వెజ్ హోటల్ ఆదివారం రోజైతే లగేజీ ఆటోల్లో తుని వరకు, ఆ చివరన యానాం వరకు పది నుంచి పదిహేను పిక్నిక్ గ్రూపులకు భోజనాలు అందిస్తున్నాయి. నాన్‌వెజ్ కేటరింగ్‌లకు సైతం గిరాకీ భారీగా ఉంది. రకరకాల నాన్‌వెజ్ వంటకాలు వండి పిక్నిక్ స్పాట్‌ల వద్దకు చేర వేయడం, పిక్నిక్ జరిగే ప్రదేశంలోనే భారీ వంటకాలు సైతం కొందరు చేయించుకుంటు న్నారు. కొందరైతే గోదావరి సమీపంలో పిక్నిక్‌లు చేసుకుంటూ లైవ్ ఫిష్ వండించుకుతింటున్నారు. దీంతో ఆదివారం వస్తే కేటరింగ్ సంస్థలకు భారీ ఆర్డర్లు వస్తున్నాయి. వెజ్‌లో పది రకాల ఐటమ్స్‌కు ప్లేటుకు రూ.250 నుంచి వసూలు చేస్తుండగా, నాన్‌వెజ్ అయితే రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. పిక్నిక్‌లో సుష్టిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ప్రకృతి చుట్టూ కాకినాడ

చుట్టూ అందాలు.. మధ్యలో కాకినాడ జిల్లా.. ఒకప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం ఇది.. ఒకవైపు చూపరులను కట్టపడేసే అందమైన ఏజెన్సీ.. మరోవైపు కాకినాడనే అనుకుని ఉన్న మడ అడవులు.. ఇంకోవైపు యానాం.. మరోవైపు పచ్చని కోనసీమ.. ఇక అందరినీ ఆకట్టుకునే కాకినాడ బీచ్.. ఇంతేనా అనుకోవద్దు.. ఏజెన్సీలో విహరిద్దామని అనుకుంటే ఒకటా రెండా ఏకంగా 8 జలపాతాలు ఉన్నాయి. అన్నీ జలకళతో పర్యాటకులను రారమ్మని పిలుస్తున్నాయి. మరోవైపు అందాల యానాం ఆస్వాదించేందుకు రమ్మంటుంది.. మడ అడవులను తిలకిస్తే ఆ ఆనందమే వేరు.. కాకినాడ జిల్లాకు ఎటు చూసినా అందమే మరి.. ఒకసారి ఆ అందాన్ని ఆస్వాదిద్దాం.. కాకినాడ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్ సౌకర్యం ఉంది. ఏజెన్సీలోని జలపాతాల వద్దకు వెళ్లాలంటే సొంత వాహనం లేదంటే అద్దెకు మాట్లాడుకుని అయినా వెళ్లాల్సిందే.



రాజమహేంద్రవరం వద్ద దివాన్‌చెరువులోని పుష్కరవనం

మహా పుష్కరవనం

లాలాచెరువు సమీపంలో జాతీయరహదారిని ఆనుకుని దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోదావరి మహా పుష్కరవనం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ వనంలో వాకింగ్‌ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, హరితవనం, కార్తీకవనం, వెదురుచెట్లు, పిల్లలు ఆడుకునే పార్క్ వంటి సదుపాయాలు ఉన్నాయి. పుష్కరవనంలో ప్రత్యేకించి కార్తీకవనం కూడా ఉంది. ఇందులో దాదాపు 80 వరకూ ఉసిరి చెట్లు ఉంటాయి. ఈ పుష్కరవనంలో వనభోజనాలు చేయాలంటే పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.10 వంతున ప్రవేశరుసుంగా చెల్లించాలి.



వైసీపీ సోషల్ మీడియా మూకలను వదలొద్దు

- నాడు నా భార్యపైనా ట్రోలింగ్స్
- అసెంబ్లీలో ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. అసెంబ్లీ సమావేశంలో శనివారం కొన్ని ప్రధాన సమస్యలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ పాలనలో కల్తీ మద్యం మృతులపై అసెంబ్లీలో తన భార్య అప్పటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని మాట్లాడితే తన కుటుంబంపైన దారుణంగా ట్రోల్ చేసిన వైసీపీ మూకలపై కఠినచర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. గత ఐదేళ్లలో టీడీపీ, జనసేనలో యాక్టివ్‌గా ఉండే కీలకమైన నాయకులపై వైసీపీ సోషల్ మీడియాలో అసభ్యకర,అభ్యంతరకర పోస్టులతో ఇబ్బంది పెట్టారని తెలిపారు. రాజమహేంద్రవరంలో మొదటి దిశ పోలీస్ స్టేషన్ అంటూ ఆర్భాటంగా ప్రారంభించగా నాటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఆ స్టేషన్‌లో తనపై జరిగిన దుష్ప్రచారంపై మొదటి కేసు నమోదు చేయిస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

ఇళ్ల లబ్ధిదారులకు వాట్సాప్ గ్రూప్ పెట్టండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

రాజానగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల నిర్మాణం ఈ డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజానగరం మండలం వెలుగుబంద పంచాయతీ పరిధిలోని హౌసింగ్ లేఅవుట్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి శనివారం పరిశీలించి మాట్లాడారు. డిసెంబరు నెల చివరి నాటికి 2,333 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటివరకు 306 (13 శాతం) పూర్తి చేయడం జరిగిందన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆప్షన్ 3 కింద 3,396 ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 683 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పునాది స్థాయిలో 56, బేస్‌మెంట్ పూర్తిచేసినవి 125, మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రతి వారం లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. లబ్ధిదారులతో కూడిన వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. బిల్లుల చెల్లింపు కోసం జియో ట్యాగింగ్ సమస్య ఉందని, వారికి సరైన విధానంలో మార్గదర్శకం చేయాలన్నారు. లబ్ధిదారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఆదివారం ఒక్కరోజు లబ్ధిదారుల అర్జీలకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులు ఉండడం వల్ల కార్పొరేషన్ సిబ్బంది సహకారం అందించాలని ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ కెఎల్ శివజ్యోతి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బీవీ.గిరి, ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు స్థల పరిశీలన

రాజమహేంద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్ శాశ్వత భవనాల నిర్మాణానికి జాంపేటలోని పోలీసు క్వార్టర్ సమీపంలోని స్థలాలను కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం అధికారులతో కలసి పరిశీలించారు. జిల్లాలు ఏర్పడి వచ్చే ఏప్రిల్ 2వ తేదీకి మూడేళ్లు పూర్తవుతునాన ఇప్పటి వరకు కలెక్టరేట్‌కు శాశ్వత భవనాలు లేవు. ప్రస్తుతం బొమ్మూరులోని నేక్ భవనాల్లోను, ఇతర భవనాల్లోను కార్యాలయాలు ఉన్నాయి. సొంత భవనాల నిర్మాణానికి జీవో జారీ అయ్యింది.ఈ నేపథంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్అండ్‌బీ అధికారులతో కలసి జాంపేట స్వామి థియేటర్ ఎదురుగా ఉన్న సుమారు ఏడు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.కలెక్టరేట్‌తో పాటు ఇతర కార్యాలయాలు శాశ్వతంగా నిర్మిస్తామన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సభ్యులు

రాజానగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ పరిధిలో నడుస్తోన్న అంగన్‌వాడీ మినీ సెం టర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరుతూ రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయ ప్రాం గణంలో శనివారం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి బేబిరాణి శనివారం వివరాలు వెల్లడిం చారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ మినీ వర్కర్స్ అనేక సేవలందిస్తున్నారన్నారు. మినీ వర్కర్లకు ప్రమో షన్లు కల్పించాలని జీవో ఉన్నప్పటికి సక్రమంగా అమలు కావడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించా లని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్ వాడీ సంఘ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ,సీఐటీయు ఉపాధ్యక్షుడు పి.వవ న్, ఎస్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాయవరం పీహెచ్‌సీలో సేవలపై ఆరా

నేషనల్ హెల్త్ రిసోర్స్ సెంటర్ వైద్య బృందం తనిఖీలు

అనపర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రామవరంలోని పీహెచ్‌సీలో ఢిల్లీలోని నేషనల్ హెల్త్ రిసోర్స్ సెంటర్ వైద్య బృందం ఆధ్వర్యంలో శుక్ర,శనివారాలు తనిఖీలు చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, వైద్య సేవలు, పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది పనితీరు వంటి అంశాలపై వివరాలు సేకరించారు.బృందంలోని వైద్యులు శశికళ, కల్పన ఆధ్వర్యంలో వైద్యుల బృందం ఆసుప త్రిని క్షుణ్ణంగా పరిశీలించారు.రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించిన ఆసుపత్రుల్లో పనితీరు మెరుగ్గా ఉన్న ఆసుపత్రులను ఎంపిక చేసి రూ.50 లక్షల ఆసుపత్రి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు.వైద్య బృందం తనిఖీలకు వస్తున్న సమాచారాన్ని పది రోజుల ముందుగానే తెలియజేయడంతో బృందం వచ్చే సరికి సిబ్బంది ఆసుపత్రిని సుందరంగా తీర్చిది ద్దారు.ఇలా కాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వ హిస్తే సమస్యలను గుర్తించే అవకాశం పూర్తి స్థాయిలో ఉండేదని ప్రజలు అంటున్నారు.ఆసుపత్రి వైద్యాధికారి సుమతీదేవి పీహెచ్‌సీ పరిధి లో సేవలను వివరించగా సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కోఆర్డినేటర్లను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి తెలిపారు.రాజమహేంద్రవరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా కొండ్రా జు,అనపర్తి కృష్ణచైతన్య రెడ్డి, కొవ్వూరు రసూల్,నిడదవోలు కోరంకి వెంకటేశ్వరరావు, రాజానగరం డాక్టర్ శ్రీనివాస్ వడయార్, గోపాలపురం కోఆర్డినేటర్ మార్టిన్ లూథర్‌లను నియమించినట్లు తెలిపారు.రాజమహేంద్రవరం సిటీ కోఆర్డినేటర్‌గా తాను వ్యవహరిస్తానని తెలిపారు.

గోదావరిలో దిగి.. చచ్చిపోదామని..

వయోభారం తాళలేక వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన స్థానికులు.. పోలీసులకు అప్పగింత

కొవ్వూరు,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వయోభారం వృద్ధులకు శాపంగా మారుతోంది.. కొంత మంది చూసేవారులేక..మరికొంత మంది చూసేవారున్నా అనారోగ్య సమస్యల కారణంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు..కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శనివారం జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజవోలు గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యనారాయణ(78) మూడు సార్లు సొసైటీ ప్రెసిడెంట్‌గా పనిచేశాడు.ఆయనకు ఇద్దరు కుమారులు..ఒక కుమార్తె.చాలా కాలం కిందట ఇద్దరు కుమారులు మరణించడంతో ప్రస్తుతం కుమార్తె వద్ద ఉంటున్నాడు.అయితే గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ఆసుపత్రి ఖర్చుల కారణంగా కుటుంబీకులకు భారం కాకూడదని ఈ నెల 15వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. రాత్రి కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోనే బస చేశారు.శనివారం ఉదయం గోదావరిలో దిగి ఆత్మహత్యాయత్నానికి ప్ర యత్నించగా స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు.ఈ మేరకు పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని సత్యనారాయణను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇదిలా ఉండగా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో శనివారం సత్యనారాయణ అదృశ్య మైనట్టు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు వివరాలు అడిగితెలుసుకుని రాజవోలు నుంచి కుటుంబీకులను రప్పించి అప్పగించారు.



పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

వచ్చే పుష్కరాలకు కమిటీలు : కలెక్టర్ 7

రాక్షస.. దారులు 6

10 నెలలు.. 243 మంది మృతి

నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

రాక్షస దారులు!



రోడ్డు ప్రమాదాల్లో బతుకులు ఛిద్రం.. కొంపముంచుతున్న అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారుల అతివేగం.. కునుకుపాటు

రోడ్డుపైకి వస్తే క్షేమంగా ఇంటికి చేరుతామన్న భరోసాపోయింది. ఏ క్షణం గుండె గుభేల్‌మనే దుర్వార్త వినాల్సి వస్తుందో అంచనా వేయలేని దుస్థితి దాపురించింది. రహదార్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో నిర్లక్ష్యం, అతి వేగం, కునుకుపాటు, రోడ్లపై గుంతలు, హెల్మెట్, సీటు బెల్టు ధరించడంలో ఏమరుపాటు.. ఇలా కారణాలేమైనా కుటుంబాలు మాత్రం ఛిద్రమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జీవితాల్లో తీరని శోకాన్ని క్షణకాలంలో తీసుకొచ్చేస్తున్నాయి. బ్లాక్ స్పాట్లలో కూడా కనీసం సదుపాయాలు తీసుకోలేని నిర్లిప్తతలో యంత్రాంగం ఉంటే.. ఇటు వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఏ లేను (వరుస)లో ఏ వాహనం, ఎంత వేగంతో వెళ్లే వాహనం వెళ్లాలో కూడా 99 శాతం మందికి అవగాహన లేదు. సూచికలున్నా పట్టదు. వెరసి నవంబరు మూడో ఆదివారం నిర్వహించే రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం రోజున రహదార్లకు బలైపోయిన వారిని స్మరించుకోవడం తప్ప పరిస్థితుల్లో మార్పు కనిపించదు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదమంటే ఒక వ్యక్తి మరణమో, లేదా కొందరు క్షతగాత్రులుగా మిగలడం కాదు.. ఏదైనా ప్రమాదంలో కుటుంబాలకు ఆధారమైన వారు చనిపోతే.. ఇక ఆ కుటుంబాలకు దిక్కులేకుండాపోతుంది. అప్పటిదాకా సంతోషంగా సాగిపోతున్న వారి జీవితాలు అల్లకల్లోలమైపోతాయి. పిల్లలు అనాథలైపోతారు. నిత్యం ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతుండగా, మరెంతో మంది తీవ్రంగా గాయపడి మంచానపడుతున్నారు. అప్పుడు కూడా ఆ కష్టాన్ని భరించాల్సింది వారి కుటుంబమే. ఇలా బాధిత కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయి. కొందరి నిర్లక్ష్యం, నిద్రమత్తు, మద్యం, అతి వేగం, రోడ్లు ఛిద్రమై ప్రమాదాలు జరుగుతున్నాయి. జరుగుతుంటే మరి కొన్ని ప్రమాదాలు రహదారులు ఛిద్రమై గోతులమయం కావడంతో జరుగుతున్నాయి. కారణమేదైనా మూల్యం మాత్రం బాధితులతోపాటు వారి కుటుంబాలు మోస్తున్నాయి.

● మృత్యు కేంద్రాలు.. బ్లాక్ స్పాట్స్

రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా జాతీయ రహదారుల్లోనే జరుగుతుంటాయి. దానికి కారణాలు అనేకం. ఇలా తరచు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తారు. చివరి మూడేళ్లలో రోడ్డులోని 500 మీటర్ల నిడివి (స్ట్రెచ్)లో ప్రమాదాలు జరిగి 5 మరణాలు లేదా 10 మరణాలు లేదా అదే సంఖ్యలో ప్రమాదాలు సంభవిస్తే అక్కడ పలు శాఖలకు చెందిన అధికారులు సర్వే చేసి బ్లాక్ స్పాట్‌గా గుర్తిస్తారు. దీంతో ఆ ప్రాంతంలో కచ్చితంగా రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. బ్లాక్‌స్పాట్‌గా గుర్తించిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. ఉత్తర ప్రత్యుత్తరాలు సవ్యంగా సాగితే బ్లాక్ స్పాట్‌గా కేంద్రం రిజిస్టర్ చేస్తుంది. వెంటనే ఆ ప్రదేశంలో రక్షణ చర్యలు చేపట్టడానికి రూ.25 లక్షలు విడుదల చేస్తుంది. దానికి రాష్ట్ర ప్రభుత్వం కొంత జత చేయడం ద్వారా తక్షణ రక్షణ చర్యలు చేపట్టి సూచన, హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, క్యాట్‌ఐస్ (రిఫ్లెక్టింగ్ స్టడ్స్), థర్మోప్లాస్టిక్ రోడ్ మార్కింగ్స్, స్పీడ్ బ్రేకర్లు, సరిపడా లైటింగ్, ముందు కొంత దూరంలో బ్లాక్ స్పాట్ ఉందని.. వేగం నియంత్రించుకొని జాగ్రత్తగా వెళ్లాలనే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

● ప్రమాదాలకు కారణాలివేనా..

బ్లాక్‌స్పాట్లు గుర్తించిన తర్వాత ప్రధానంగా ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవేస్, విద్యుత్తు, ఆర్టీఏ, మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగాల పాత్ర ఎక్కువగా ఉంటుంది. అవసరమైన విద్యుత్తు, రోడ్డు మార్కింగులు, బోర్డుల ఏర్పాటు ఆ శాఖల పనే. పోలీసులు ఆయాచోట్ల స్టాపర్ బోర్డులు వంటివి ఏర్పాటుచేయడం, సిబ్బందిని కాపలాగా ఉంచడం చేస్తారు. శాఖల మధ్య సమన్వయ లోపం, ఆయా శాఖలు చేయాల్సిన రక్షణ పనుల్లో తీవ్ర అలసత్వం వల్ల బ్లాక్ స్పాట్లు మరిన్ని ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. అలాగే.. వాహన చోదకుల మితిమీరినతనం కూడా ప్రాణాలు కోల్పోయేలా చేస్తోంది. అతివేగం, నిద్రమత్తు, వచ్చీరాని డ్రైవింగ్, మద్యం సేవించి నడపడం, మలుపుల్లో, ఏదైనా అకస్మాత్తుగా ఎదురైతే అదుపు చేసుకోలేకపోవడం, రాంగ్‌రూట్‌లో వెళ్లడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్నా నిర్లక్ష్యం, వాహనాలు కండీషనల్‌లో లేకపోవడం, రాత్రి వేళల్లో హైవేపై వాహనాలు నిలిపినా భద్రతా సిబ్బంది పట్టించుకోకపోవడం వంటి కారణాలు ప్రజల ఊపిరిని ఆపేస్తున్నాయి.

● ఏం చెయ్యొచ్చు

జాతీయ రహదారులు లేదా రెండు లేన్లు, సింగిల్‌లేన్(వరుస) రోడ్లపై స్పీడుగా వెళ్లే, నింపాదిగా వెళ్లే, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు, కార్లు ఏవి ఏ లేనులో వెళ్లాలో ఇప్పటికీ అధికశాతం మంది వాహనదారులకు అవగాహన లేదు. దీనిపై విస్తృతంగా చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది. టోల్‌గేట్ల వద్ద ఫోన్ నంబరు తీసుకొని ఆయా వాహనదారులను అప్రమత్తం చేసేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణపై మెసేజ్‌లను పంపొచ్చు. హెల్మెట్, సీటుబెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా ప్రజలకు అవగాహన కలిగించవచ్చు. అతి వేగంగా వెళ్లేవాళ్లకు కౌన్సెలింగ్, అవసరమైతే కేసులు నమోదు చేయాలి. రోడ్లపై ఇష్టానుసారం పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించవచ్చు. రోడ్ల పక్కన ప్రమాద నివారణ సూచన, హెచ్చరిక బోర్డులను విస్తృతంగా ఏర్పాటుచేయాలి. గతంలో రాత్రి 12 గంటల నుంచి వాహన డ్రైవర్లను పోలీసులు గమనించేవారు. 2గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్య డ్రైవర్ల ముఖాన్ని నీటితో కడిగించడం చేయించేవారు. సిబ్బంది కొరత వేధిస్తున్న పోలీసు శాఖకు ఇలాంటివి వీలుపడడం లేదని తెలుస్తోంది.

'తూర్పు'లో పది నెలల్లో 243 మంది మృతి.. 626 మంది క్షతగాత్రులు

తూర్పుగోదావరి జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయి. జాతీయ రహదారుల పరిధి ఉన్న ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు రోడ్డు ప్రమాదాల కేసుల నమోదు, దర్యాప్తు, విచారణలు ప్రహసనంగా మారుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలోని 595 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా ఏకంగా 243 మంది ప్రాణాలు బలైపోయాయి. 626 మంది ఆస్పత్రి పాలయ్యారు. రాజానగరం, బొమ్మూరు, దేవరాపల్లి, నల్లజర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ 10 నెలల్లో 110 మంది విగత జీవులయ్యారు. ఇంచుమించు జాతీయ రహదార్లతో రాష్ట్ర రహదారులు ప్రమాదాల్లో పోటీపడుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లోని మరణాలు కుటుంబ సభ్యులను నిర్జీవంగా చేస్తుంటే.. గాయాలపాలైన వాళ్లలో చాలామంది మంచానికి, వీల్‌చైర్లకు పరిమితమై జీవితమంతా నరకం చూస్తున్నారు.

2024 జనవరి నుంచి అక్టోబరు వరకు..

స్టేషన్	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
వన్‌టౌన్	17	4	18
త్రీటౌన్	52	9	65
ప్రకాశ్‌నగర్	17	5	20
టూటౌన్	20	5	20
ధవళేశ్వరం	36	7	37
కడియం	30	9	43
రాజానగరం	45	29	26
కోరుకొండ	27	12	23
గోకవరం	23	7	29
సీతానగరం	10	5	8
బొమ్మూరు	46	25	36
అనపర్తి	13	3	14
బిక్కవోలు	14	4	17
రంగంపేట	10	5	8
కొవ్వూరుటౌన్	46	15	68
కొవ్వూరురూరల్	17	10	28
చాగల్లు	13	02	16
తాళ్లపూడి	13	4	12
గోపాలపురం	17	8	19
దేవరపల్లి	33	34	28
నిడదవోలు	15	3	17
సమిశ్రగూడెం	17	08	18
ఉండ్రాజవరం	07	02	05
పెరవలి	20	06	21
నల్లజర్ల	37	22	30
మొత్తం	595	243	626



తాళ్లూరులో జరిగిన ప్రమాదం(ఫైల్)

డేంజర్..డేంజర్

మురారి-నీలాద్రిరావుపేట పరిధిలో ఎక్కువ ప్రమాదాలు

గండేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలో మురారి గ్రామం నుంచి నీలాద్రిరావుపేట గ్రామం వరకు సుమారు 19 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మల్లేపల్లి గ్రామ శివారులో కొన్నేళ్ల క్రితం పశ్చిమగోదావరికి చెందిన ఐదుగురు కళాకారులు మృతిచెందారు. ఇటీవల మురారి గ్రామ శివారులో పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన ముగ్గురు అన్నాదమ్ములు మృతిచెందారు. అలాగే తెలంగాణకు చెందిన బావాబామ్మర్దులు ఇటీవల మృత్యువాతపడ్డారు.

ప్రమాదాలు జరిగే స్పాట్‌లు

మురారి నుంచి నీలాద్రిరావుపేట వరకు ఏడు గ్రామాలుండగా 15కి పైగా డివైడర్లు ఉన్నాయి. మురారి, మల్లేపల్లి, గండేపల్లి, జడ్.రాగంపేట, తాళ్లూరు డివైడర్ల వద్ద మలుపులు ఎక్కువగా ఉం డడంతో గ్రామస్తులు వాహనాలు గమనించకపోవడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో హైవేపై విద్యుత్ లైట్లు వెలగకపోవడం, దాబా రెస్టారెంట్ల వద్ద వాహనాలు నిలిపివేయడం, వర్షాకాలంలో గోతుల్లోకి నీరు చేరడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

గస్తీ ముమ్మరం చేశాం



రాత్రి వేళల్లో హైవేపై గస్తీ ముమ్మరం చేశాం. నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు పెట్టిస్తున్నాం. ● గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు

రోడ్డున పడ్డ కుటుంబాలు

ప్రత్తిపాడు,నవంబరు16(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో 16 కిలోమీటర్ల పైబడి జాతీయ రహదారి విస్తరించింది. గత జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృత్యువాత పడ్డారు. 50 మంది గాయపడ్డారు. ముఖ్యంగా పాదాలమ్మ తల్లి గుడి వద్ద ముగ్గురు లారీ డ్రైవర్లపై రాజమండ్రి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు దూసుకువెళ్లిన ఘటనలో ముగ్గురు డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే గుడి వద్ద పని చేసే వ్యక్తిని కూడా అదే బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. గోవిందపురం కొండ జంక్షన్, నరేంద్రగిరి జంక్షన్, చెక్‌పోస్టు సెంటర్, సుద్దగడ్డ బ్రిడ్జి, రాచపల్లి అడ్డురోడ్డు, ధర్మవరం బైపాస్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్ సెంటర్, నిడిగట్ల వంతెన సెంటర్లలో ఎందరో మృతిచెందారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

కాకినాడ జిల్లాలో పది నెలల్లో 235 మృతులు

కాకినాడ క్రైం నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జనవరి నెల నుంచి అక్టోబరు నెల వరకు జిల్లావ్యాప్తంగా 220 ఘోర ప్రమాదాలు చోటుచేసుకోగా 235 మంది మృత్యువాతపడ్డారు. వారిలో 204 మంది పురుషులుకాగా 31 మంది మహిళలు. అలాగే మరో 97 రోడ్డు ప్రమాదాల్లో 134 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. అలాగే 348 ప్రమాదాల్లో 656 మంది గాయాలపాలయ్యారు. గత ప్రభుత్వం ఛిద్రమైన రహదారుల పట్ల శ్రద్ధ వహించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో పెద్ద సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని పలు ప్రజాసంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్దను రోడ్డు ప్రమాదాలు మింగేస్తుంటే ఆయా కుటుంబాలు రోడ్డునపడి తేరుకోలేకపోతున్నాయి. బాధిత కుటుంబాల ఆర్థిక స్థితి పూర్తిగా మారిపోయి దీనస్థితిలోకి వెళ్లిపోతున్నారు. అనేకమంది భార్యాభర్తలు చనిపోయి పిల్లలు అనాథలవుతున్నారు. ఈ ప్రమాద విషాదాలు ఆయా కుటుంబాలను జీవితాంతం వెంటాడుతున్నాయి. కాగా కాకినాడ జిల్లా పోలీసులు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న రహదారుల్లో 55 బ్లాక్‌స్పాట్లను గుర్తించి నిరంతర భద్రతను ఏర్పాటుచేశారు. అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



నిరాశ్రయులుగా.. మిగిలిపోయారు!

2024 జనవరి 30న తేటగుంట హైవే కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తేటగుంటకు చెందిన గొర్ల నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. రోజువారీ కూలీగా ఉన్న నాగేశ్వరరావుపై భార్య, ముగ్గురు పిల్లలు, ఆయన తల్లి ఆధారపడి జీవించేవారు. ప్రమాదంలో ఇంటి యజమాని మరణించడంతో కుటుంబ మొత్తం నిరాశ్రయులుగా మిగిలామని వారు చెప్పారు. బీమాగానీ, ఆర్థిక సాయంగానీ అందకపోవడంతో భార్య పాపారత్నం రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తోంది.

- తుని రూరల్/ఆంధ్రజ్యోతి



ప్రత్తిపాడు గోవిందపురం కొండ జంక్షన్ వద్ద ప్రమాదాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

● 'తూర్పు'లో రోడ్డు.. ప్రమాదాలిలా..

రహదారి	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఎన్‌హెచ్ 216(ఏ)	55	28	49
ఎన్‌హెచ్ 16	120	62	140
ఎన్‌హెచ్ 516(ఈ)	39	17	36
365బీబీ	15	08	14
516డీ	13	07	14
స్టేట్ హైవేలు	212	65	227
ఇతర రోడ్లు	141	40	146
మొత్తం	595	243	626





ఎన్నెన్నో అందాలు...

1. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి నుంచి ధారపల్లి దారి మార్గంలో కనిపించిన ప్రకృతి సోయగం. 2. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధారపల్లి కొండల మధ్యలో నుంచి చూపరులను కనువిందు చేసిన జలపాతం.



పెద్దాపురం శృంగారవల్లభస్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శృంగారవల్లభస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తజనం



శృంగారవల్లభ స్వామివారు

పెద్దాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,38,620, అన్నదాన విరాళాలు రూ.85,895, కేశఖండన ద్వారా రూ.5,560, తులాభారం, కానుకల ద్వారా రూ.500, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ.28,665 వెరసి రూ.3,59,240 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్వామి వారిని సుమారు 8 వేల మందికి పైగా భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



స్ఫటిక లింగానికి పూజ చేస్తున్న మంత్రి సుభాష్



లింగానికి మొక్కుతున్న మంత్రి రామానాయుడు

స్ఫటికలింగానికి మంత్రుల పూజలు

పెరవలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులోనున్న శివాలయం వద్ద స్ఫటిక లింగాన్ని శనివారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దర్శించుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా స్ఫటికలింగ దర్శనాన్ని భక్తులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులతోపాటు మంత్రులు సుభాష్, రామానాయుడు స్ఫటిక లింగాన్ని దర్శించుకుని పూజలు చేశారు. సంవత్సరంలో మూడుసార్లు మాత్రమే దర్శనానికి అవకాశం ఉంటుందని మిగతా రోజుల్లో కోనేరులో ఈ శివలింగాన్ని ముంచి వేస్తామని ఆలయ అధికారి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో కుండలేశ్వరస్వామి

కుండలేశ్వరంలో ప్రత్యేక పూజలు

కాట్రేనికోన, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరంలో శనివారం స్వామి వారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలు చేసి గోదావరిమాతకు పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గ దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో చెయ్యేరుకు చెందిన మంతెన మమ్మురాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో 2000 మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, నంద్యాల వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ భద్రరావు, మోటిపల్లి శ్రీను, సలాది సతీష్, చిక్కం ఆనందకుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ళ శంకర్, మీసాల బాలచంద్రరావు పాల్గొన్నారు.

భక్తులతో వాడపల్లి ఆలయం కిటకిట

● ప్రత్యేక అభిషేకాలు, పూజలు ● స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.41.53 లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తడంతో కిక్కిరిసింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను జరిపి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు జరిపి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. అరకు ఎమ్మెల్యే ఆర్.మత్స్యలింగం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు స్వామివారి చిత్రపటం అందించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒకరోజు ఆదాయం రూ.41.53 లక్షలు వచ్చినట్టు ఉప కమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి. పక్క చిత్రంలో స్వామివారి ఆలయంలో భక్తుల సందడి

అంతర్వేది ఆలయంలో భక్తుల సందడి

అంతర్వేది, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తడంతో సందడి నెలకొంది. స్వామివారి నిత్యాభిషేకం, సుదర్శన హోమాల్లో భక్తులు పూజలు చేశారు. ఆలయం లోపల వేపచెట్టు చుట్టూ కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ముడుపులు కట్టారు. అయ్యప్ప మాలధారులు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని నిత్యాన్నదానంలో పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం: నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన కొప్పిశెట్టి వెంకటరమణ, కుటుంబ సభ్యులు రూ.1,11,116 విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి చేతులమీదుగా అందించినట్టు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది కిరణ్, గుత్తుల శ్రీను, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద దర్శనానికి బారులుతీరిన భక్తులు

పాదగయలో ప్రిన్సిపల్ కార్యదర్శి పూజలు


పిఠాపురం పాదగయ క్షేత్రంలో సాధారణ పరిపాలనాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీమోహన్

పిఠాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సాధారణ పరిపాలనాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాణీమోహన్ శనివారం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. వాణీమోహన్‌కు ఆలయ ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ప్రసాదాలు, అమ్మవార్ల ఫోటోను అందజేశారు.

భీమేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి పూజలు


సామర్లకోట భీమేశ్వరాలయంలో హైకోర్టు జడ్జి జయసూర్య దంపతులు

సామర్లకోట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి నైనాల జయసూర్య సతీసమేతంగా శనివారం కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామభీమేశ్వరస్వామిని, బాలాత్రిపుర సుందరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హైకోర్టు జడ్జి జయసూర్య దంపతులకు ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా ఆలయం ఆవరణలో అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. పండితులచే వేదాశీర్వచనం పొంది స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందుకున్నారు.

క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ : డీఈవో

● కాకినాడలో ఉత్సాహంగా రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కాకినాడజిల్లా డీఈవో పి.రమేష్ అన్నారు. కాకినాడ డీఎస్ఏ మైదానంలో శనివారం పాఠశాల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్19 హాకీపోటీలు ప్రారంభమయ్యాయి. సమాఖ్య జిల్లా కార్యదర్శి లంకా జార్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈనెల 16 నుంచి 18వరకు మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో ఏరోజుకారోజు విజేతలను ప్రకటిస్తారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ, పరిశీలకుడు సెల్వపాండియన్, హాకీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.రవిరాజు, పీఈటీ సంఘ జిల్లా కార్యదర్శి సూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలు వీరే

బాలికల్లో గుంటూరు జట్టుపై 11పాయింట్ల తేడాతో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. నెల్లూరుపై అనంతపూర్(.0.5), గుంటూరుపై విజయనగరం(0.2), ప్రకాశంపై కర్నూలు (0.1), కర్నూలుపై అనంతపూర్ 0.9. పశ్చిమగోదావరిపై కృష్ణా 0.1, విజయనగరంపై తూర్పుగోదావరి0.11, శ్రీకాకుళంపై కడప 0.7, నెల్లూరుపై కర్నూలు 0.1, పశ్చిమగోదావరిపై విశాఖ0.1 పాయింట్ల తేడాతో విజయం సాధించారు. బాలుర విభాగంలో శ్రీకాకుళంపై తూర్పుగోదావరి 0.5, విజయనగరంపై అనంతపురం 0.17, కర్నూలుపై కృష్ణా 0.2, శ్రీకాకుళంపై నెల్లూరు0.3, చిత్తూరుపై అనంతపురం 0.2, కృష్ణాపై విశాఖజట్టు 0.7 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి.


రాష్ట్రస్థాయి హాకీ పోటీలు ప్రారంభిస్తున్న డీఈవో రమేష్


గౌరవ వందనం ఇస్తున్న క్రీడాకారులు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా?

● అసెంబ్లీ సమావేశాలే కారణమా?


మండపేట మండలం తాపేశ్వరం లాకులు

మండపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ విరామం తర్వాత సాగునీటి సంఘాలకు జరిగే ఎన్నికలు ఈనెల 23న నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసినట్టు సమాచారం. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో నీటిసంఘ ఎన్నికలు డిసెంబరు 8న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 990 మంది సభ్యులు సంఘాల్లో ఉంటారు. వీరంతా నీటిసంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14, ప్రాజెక్టు కమిటీ 1కి సంబంధించి ఈనెల 23న ఎన్నికలు జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని వాయిదా వేశారు. డిసెంబరు 8న నిర్వహిస్తారా లేక మరో సారి వాయిదాపడతాయనే విషయం ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంది. ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ కానప్పటికీ ఎన్నికలు వాయిదా వేస్తున్నామన్న సమాచారం మాత్రం అధికారులకు చేరింది. దాంతో సాగునీటి సంఘాలు వాయిదా పడ్డాయని అధికారులు చెబుతున్నారు. ఇదిలావుంటే వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను రద్దుచేయటంతో ఐదేళ్లపాటు సంఘాల ఊసు లేదు. పంటకాల్వల ఆధునికీకరణకు కాణీపైసా కూడా విదల్చలేదు. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తిరిగి నీటి సంఘాలు తెరపైకి వచ్చాయి. గతంలో ఇక్కడ సంఘాల తరపున డీసీ, ప్రాజెక్టు కమిటీల తరపున పనిచేసిన వారే ఇపుడు తిరిగి సాగునీటి సంఘాల అధ్యక్ష పదవుల కోసం పోటీపడుతున్నారు. మొత్తంమీద సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన ఏకగ్రీవంగా నీటిసంఘాలను తమ ఖాతాలో వేసుకోవాలని గట్టిప్రయత్నాలు చేస్తున్నారు. సాగునీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు ఎపుడు జరుగుతాయని ఇరిగేష్ ఉన్నతాధికారిని ప్రశ్నించగా ఈనెల 23న జరగాల్సిన ఎన్నికలు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందుకు ప్రస్తుతం వాయిదా వేస్తున్నట్టు తమకు సమాచారం అందిందని ఎపుడు ఎన్నికలు జరుగుతాయనేది స్పష్టమై ఆదేశాలు తమకు ఇంకా చేర లేదని ఆయన చెప్పారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

● వీధినపడ్డ ఇద్దరు ఆడపిల్లలు, భార్య


మట్టిలో కూరుకుపోయిన


శ్రీనుబాబు(ఫైల్)

శ్రీనుబాబు,

రౌతులపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటుకబట్టీలో మట్టితొక్కుతుండగా ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన సంఘటన రౌతులపూడి మండలం బంగారయ్యపేటలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం బంగారయ్యపేట గ్రామానికి చెందిన పబ్బిరెడ్డి శ్రీను బాబు (38) గ్రామశివారున గల విరవాడకు చెందిన దిబిడి కృష్ణార్జున్ ఉదయం 6గంటల సమయంలో ఇటుక బట్టీలో ట్రాక్టర్‌తో మట్టిని తొక్కుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి తిరగబడి మట్టిలో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. శ్రీనుబాబు కూలిపని చేసుకుంటూ ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భర్త మృతితో ఇద్దరు ఆడపిల్లలను తాను ఎలా పోషించాలంటూ భార్య రోధిస్తోంది. రౌతుల పూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జైలులో కలిశారు.. చోరీలు చేస్తున్నారు!

● సాగిపాడు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు
● రెండు వారాల్లో కేసు ఛేదించిన పోలీసులు
● 40 కాసులు బంగారం..
రూ.2.70 లక్షలు స్వాధీనం


సాగిపాడు చోరీ కేసులో అరెస్టు చేసిన వ్యక్తులతో పాటు 40 కాసుల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు

గోపాలపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం పోలీసులు రెండు వారాల్లోనే చోరీ కేసును ఛేదించి ముగ్గురిని శనివారం అరెస్టుచేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడుకు చెందిన భమిడిపాటి శ్రీనివాస్ ఈనెల 2వ తేదీన ఊరెళ్లాడు. ఆ సమయంలో అతని భార్య శారద, అత్తగారు గరిమెళ్ళ సూర్యకాంతం ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు మాస్కు, ముసుగులు ధరించి ఒక్కసారిగా ఇంట్లో ప్రవేశించారు. ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించగా దాడి చేశారు. అనంతరం 40 కాసుల బంగారం, రూ.2.70 లక్షలు నగదు పట్టుకుని పరారయ్యారు. ఈ మేరకు సమాచారం అందడంతో శ్రీనివాస్ ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఏడు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గోపాలపురం శివారు దుర్గమ్మగుడి వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి విచారించారు. ఎట్టకేలకు చోరీ కేసులో ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం పాతకొండగూడెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్(పండు), షేక్ అబ్దుల్ బాదుల్లా షరీఫ్(జంగారెడ్డిగూడెం), గోపాలపురం మండల తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నక్కా కిషోర్ బాబులను శనివారం ఉదయం అరెస్టు చేశారు. ఏలూరు జిల్లాకు చెందిన ఇద్దరు అంతర జిల్లా నేరస్తులని.. గతంలో జైలుకు వెళ్లివచ్చారు. నక్కా సతీష్‌బాబు ఆయిల్ చోరీ కేసులో సెంట్రల్ జైలులో ఉన్నాడు. జైలులో ఏర్పడిన పరిచయంతో ముగ్గురు స్నేహితులుగా మారారు. అనుపానులు గమనించి చోరీలు చేయడం అలవాటుగా చేసుకున్నారు. గోపాలపురం ఘటనలో పోలీసులకు చిక్కారు. ముగ్గురిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి శనివారం కొవ్వూరు కోర్టుకు తరలించినట్టు దేవరపల్లి సీఐ పి.నాగేశ్వరరావు నాయక్, ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ కేసును ఛేదించిన పోలీసులను సిబ్బందిని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించినట్టు తెలిపారు.

అన్నవరం దేవస్థానం సిబ్బంది సమష్టి కృషితోనే

గిరిప్రదక్షిణ, పౌర్ణమి వేడుకలు విజయవంతం


ఈవో రామచంద్రమోహన్‌ను అభినందిస్తున్న దేవస్థానం ఉద్యోగులు

అన్నవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలు, సుమారు రెండు లక్షల మంది భక్తులు పాల్గొన్న గిరిప్రదక్షణ కార్యక్రమం సిబ్బంది సమిష్టికృషితోనే విజయవంతమైందని ఈవో రామచంద్రమోహన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం కార్యక్రమం విజయవంతం కావడంతో ఆయనను అభినందించగా ఈవోపై వ్యాఖ్యలు చేశారు. తాను గతేడాది అనుభవాలు దృష్ట్యా మార్పులు మాత్రమే చేశానని ప్రతిఒక్క ఉద్యోగి శ్రమించారని అన్నారు. మున్ముందు ఇదే ఐక్యతతో పనిచేయాలని సూచించారు. ఈవోకు వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సి.హెచ్.రామ్మోహనరావు, ఈఈ రామకృష్ణ, ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐ.వి.రామారావు, అనకాపల్లి ప్రసాద్, కంచి మూర్తి, కంచిభట్ల రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ లెక్కల రమేష్ తదితరులు ఉన్నారు.

'పసుపు పీతలు సాగుకు అనుకూలం'


స్థలాన్ని పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్

కాట్రేనికోన, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిర్రయానాంలో పసుపు పీతల హేచరీకి కేటాయించిన ఐదెకరాల భూమిని శనివారం మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ తమిళనాడు హేచరీ నుంచి పీత ఒక్కింటికి రూ.12కు కొని, మూడు రూపాయలు రవాణా ఛార్జీ చెల్లిస్తున్నామన్నారు. 1300కి.మీ ప్రయాణం కారణంగా 50శాతం పిల్లలు చనిపోతున్నాయన్నారు. స్థానికంగా పసుపు పీతల పిల్లలను ఉత్పత్తి చేస్తే పీతల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఇది మొదటి ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీవో చొరవ తీసుకుని కేవలం 15రోజుల్లో హేచరీకి భూమిని కేటాయించడం ఆనందదాయకమన్నారు. రూ.2.75 కోట్ల అంచనాతో ప్రాజెక్టును ప్రతిపాదించడం సంతోషంగా ఉందన్నారు. కమిషనర్ డోలాశంకర్ మాట్లాడుతూ అందరి సహకారంతో నాలుగు నెలల్లో హేచరీని నెలకొల్పుతామన్నారు. ఇక్కడి వాతావరణం పీతల సాగుకు అనుకూలంగా ఉందని ఆయన అన్నారు. యునైటెడ్ నేషన్స్ అభివృద్ధి ప్రోగ్రాం ప్రతినిధి సుదీప్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.శ్రీనివాస్, మత్స్యశాఖ సహాయసంచాలకుడు ఎల్బీఎస్ వర్ధన్, ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, గ్రామ మత్స్యశాఖ సహాయకులు లోవరాజు, బాలయోగి, మీనాకుమారి, రవికిరణ్ పాల్గొన్నారు

పుష్కరాలు-2027కి ప్రత్యేక కమిటీలు

● తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ముందస్తు ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం సమీక్షించారు. రాబోయే గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని, అందుకు అనుగుణంగా నియమించిన కమిటీలన్నీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆయా శాఖలవారీ చేపట్టే పనుల ప్రాధాన్యతానుసారం ఒక్కొక్క కమిటీని నియమిస్తున్నామన్నారు. ట్రాఫిక్, హెల్త్ అండ్ శానిటేషన్, ఫుడ్‌కమిటీ, సర్వేలెన్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, పుష్కరనగర్ కమిటీ, డిజాస్టర్ కమిటీ, ప్రొటోకాల్, ఎగ్జిబిషన్, చైల్డ్ అండ్ లేబర్ కమిటీ, టెలికమ్యూనికేషన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో మున్సిపల్ అధికారులు, రూరల్ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అంశాలపై కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్డీవోలు ప్రజంటేషన్లు సిద్ధం చేయాలన్నారు. గత పుష్కరాల కంటే 2027 నాటి పుష్కరాలకు ప్రత్యేక బస్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆయా అధికారిక కమిటీలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్వో సీతారామమూర్తి, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బారావు, టీటీవో ఆర్.సురేష్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో కెఎల్.జ్యోతి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు పాల్గొన్నారు.

గాలి నాణ్యతను పెంపొందించేందుకు చర్యలు

● వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్ పరిశీలించిన కమిషనర్


వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్


రాజమహేంద్రవరం సిటీ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా గాలి నాణ్యతను పెంచడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఎన్కాప్ నిధులతో కొనుగోలుచేసిన వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా మంచినీటిని గాలిలోకి చల్లడం ద్వారా గాలిలోని కాలుష్యాన్ని తగ్గించవచ్చని, దుమ్ము, విసర్జిత పదార్థాలు తగ్గుతాయన్నారు. వాహనంపై స్ప్రే చేసే మిషన్ ఏర్పాటు చేశామని, దాని ద్వారా నీటిని చల్లుతామని నిరంతరాయంగా రెండుగంటలు పని చేస్తుందన్నారు. కాలుష్య ప్రాంతాలను గుర్తించి అక్కడ వాహనం ద్వారా నీటిని వెదజల్లాలని అందుకోసం నెలకు పరిపడా షెడ్యూల్ తయారు చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ వాహనం మీద పనిచేయడానికి వీలుగా డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఐ.పాండురంగారావు, జీపీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవీ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతుడు సాయిబాబు

ముమ్మిడివరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిగా ఉండి అప్పు ఇప్పించిన వ్యక్తికి ఆ సొమ్ము తీసుకున్న వ్యక్తి సరైన సంజాయిషీ చెప్పకపోవడంతో మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ తిల్లమ్మ చెరువుకాలనీకి చెందిన మెల్లం సాయిబాబు(33) రాణేలంకకు చెందిన అతడి స్నేహితుడికి రూ.15 లక్షలు అప్పుగా ఇప్పించాడు. ఆ అప్పుకు సంబంధించి సాయిబాబు ష్యూరిటీగా ఉన్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలని సాయిబాబు అతని స్నేహితుడిని పదేపదే అడిగినా తనకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పదిరోజులుగా తీవ్ర మనస్తాపానికి గురై 14వ తేదీ రాత్రి అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటివద్ద కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీమేశ్వరాలయంలో సంప్రదాయబద్ధంగా జ్వాలాతోరణం


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు


సామర్లకోట భీమేశ్వరాలయంలో జ్వాలాతోరణం పూజలు చేస్తున్న భక్తులు

ద్రాక్షారామ, నవంబరు16(ఆంధ్రజ్యోతి):ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శనివారం జ్వాలాతోరణం కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృత్తిక నక్షత్రం రోజున స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తారు. సాయంత్రం 8 గంటలకు స్వామివారికి సర్వదేవాతా ఆహ్వానం, దూపసేవ నిర్వహించారు. అనంతరం ప్రదోషకాల పూజ జరిపారు. నేతి జ్యోతికాంతిలో ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణం చేశారు. సప్తగోదావరి తీరంలో జ్వాలాతోరణం నిర్వహించారు. మంత్రి సుభాష్ సతీసమేతంగా స్వామి వారిని దర్శించుకుని జ్వాలాతోరణం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌జేసీ సుబ్బారావు, ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీ, ఆలయ అర్చకులు, వేదపండితులు, స్వస్తివాచకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోట: శనివారంరాత్రి కుమారరామ భీమేశ్వరాలయం ఎదుట జ్వాలాతోరణ పూజలు వందలాది భక్తుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజశేఖరశర్మ, వెంకన్న తదితరులచే ముందుగా వేద మంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి,అమ్మవార్ల దేవతామూర్తులను ప్రత్యేక సర్వవాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించి రాత్రికి ఆలయానికి తోడ్కొనిరాగా అప్పటికే వేచి ఉన్న భక్తులు శివనామ స్మరణల మధ్య పండితులు జ్వాలాతోరణాన్ని జ్వలింపజేశారు. ఈ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.

విలీన గ్రామాలకు ఎన్నికలు జరపాలి

» వ్యవసాయ సొసైటీలకు ఎలక్షన్ నిర్వహించాలి » అసెంబ్లీలో ఎమ్మెల్యే బత్తుల



కోరుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలోని 10 విలీన గ్రామాలకు పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడిందని, దీని వల్ల గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం ఆయన తన వాణి వినిపించారు. గత వైసీపీ పాలనలో వ్యవసాయ సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని, స్కామ్‌లను నివారించాలంటే తక్షణం సొసైటీలకు ఎన్నికలు జరపాలన్నారు. అలాగే 10 గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు జడ్పీటీసీ ఎన్నికలు జరగకపోవడం వల్ల ఆ గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఖాళీగా ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కొందరు రాజీనామా చేయగా మరికొందరు మరణించారని, వారి స్థానంలో ఎన్నికలు నిర్వహించి కొత్త వారిని నియమించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ సొసైటీలను నిర్వీర్యం చేసిందన్నారు. దీని వల్ల పెద్ద ఎత్తున అవినీతి పేరుకుపోయిందన్నారు. సొసైటీలకు నామినేటెడ్ పోస్టులు నియమించడం వల్ల ఆ సొసైటీలు స్కామ్‌లకు నిలయాలుగా మారాయన్నారు. అటు విలీన గ్రామాలకు, ఇటు వ్యవసాయ సొసైటీలకు తక్షణం ఎన్నికలు నిర్వహించాలని బత్తుల కోరారు.

వంతెనల నిర్మాణాలు పూర్తి చేయండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కాకినాడ కాలువపై అసంపూర్తిగా ఉన్న మూడు వంతెనలను పూర్తిచేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ సుమారు 12 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాకినాడ కెనాల్‌పై మూడు వంతెనల నిర్మాణాలను చేపట్టి సుమారు 70శాతం పనులను పూర్తి చేసిందన్నారు. అయితే ఈ వంతెనలు ఉపయోగంలోకి రాలేదని సుమారు మూడు నాలుగు కోట్లు వెచ్చిస్తే మూడు వంతెనలు వినియోగంలోకి వస్తాయన్నారు. ముఖ్యంగా కొమరిపాలెం, కొంకుదురు గ్రామాల్లో వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గోదావరి డెల్టాలో ఇదే తరహాలో అనేక వంతెనలు అసంపూర్తిగా ఉన్నాయని వీటిపై కూడా మంత్రి దృష్టి సారించాలని నల్లమిల్లి కోరారు.

నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలి



ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికల అందజేత

దివాన్‌చెరువు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నైపుణ్యాల కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థులంతా నైపుణ్యాలను మరింత పెంచుకోవాలని, తద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయ నిర్మల ఆకాంక్షించారు. కళాశాల ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ క్లాస్‌రూమ్ ప్రాజెక్టు సహకారంతో ఆరు రోజులు నిర్వహించిన ఉపాధి నైపుణ్యాల శిక్షణ శనివారం ముగిసింది, ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాంది ఫౌండేషన్‌లో భాగంగా భవిష్యత్‌లో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ, ప్లేస్మెంట్ అధికారి బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఆఖరి సంవత్సరం విద్యార్థులు 270 మంది ఈ కార్యక్రమంలో శిక్షణ పొందారన్నారు. వర్సిటీ ఇంజనీర్ కె.నూకరత్నం, ట్రైనర్స్ రజనీ, రాజ్యలక్ష్మి, చైతన్య, జీవన్, గౌతమ్ తమ అభిప్రాయాలను తెలిపారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

రెల్లి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెల్లి కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ ను వెంటనే నియమించాలని రెల్లి కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలాపు వెంకటేశ్వరరావు కోరారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయానికి తామంతా కృషి చేశామన్నారు. అయితే వివిధ కులాలకు కార్పొరేషన్లు ప్రకటించారని, అందులో రెల్లి కార్పొరేషన్ లేకపోవడం తమను బాధించిందన్నారు. అందుకే సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని, రెల్లి కార్పొరేషన్ ప్రకటించాలని, నామినేటెడ్ పోస్టుల్లో రెల్లిలకు ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నామన్నారు. ఎస్సీ ఉపకులాలుగా ఉన్న రెల్లీకు 5శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో రెల్లి సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బంగారు తాతారావు, బంగారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయోద్యమకారుల సేవలు చిరస్మరణీయం

» గ్రంథాలయ వారోత్సవాలు
» ఉద్యమకారుల సంస్మరణ సభ
» వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

రాజానగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ వ్యవస్థను చిరస్థాయిగా నిలిపేందుకు కృషి చేసిన గ్రంథాలయ ఉద్యమకారుల సేవలు చిరస్మరణీయమని గైట్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయాధికారి సీహెచ్ బాలకృష్ణ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రాజానగరం శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో పనిచేసిన పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్, సూరి వెంకటశాస్త్రి గ్రంథాలయ వ్యవస్థకు చేసిన కృషిని వివరించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమకర్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కలగర సత్యనారాయణ, మద్దూరి చిన అమ్మిరాజు, ఎస్‌కె సలీం, యర్రా శైలజ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జన్మస్థలమైన కొం కుదురు గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా చదువు ప్రాముఖ్యత, పుస్తకాల అవసరం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ఈ పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి ఎస్.బాల తెలిపారు. కొంకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థులు, హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు ఎ.అప్పారావు పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 20న బహుమతులు అందజేస్తామని బాల చెప్పారు.

రంగంపేట: విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికలతో ఏకాగ్రతతో చదివి లక్ష్యం సాధించాలని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత ఉద్యోగి పీవీఎస్. ప్రసాదరావు అన్నారు. రంగంపేట శాఖా గ్రంథాలయం లో లైబ్రేరియన్ నల్లమిల్లి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలల నుంచి 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రంగంపేటలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాజమహేంద్రవరం కల్చరల్: దానవాయిపేట మహిళా గ్రంథాలయంలో జరిగిన సభకు అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ మాట్లాడు తూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను ఉపయోగించుకుని అభివృద్ధిలోకి రావాలన్నారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ పి.బాపిరాజు, వినోద్‌కుమార్, ఐ.నవీన్‌కుమారి, ఎ.రంగనాధన్, లైబ్రరియన్ ఎ.చంద్రపద్మావతి పాల్గొన్నారు. సీతంపేట గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమకారులు ఏఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన పీవీఎస్ కృష్ణారావు పూలమాలలతో నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, అనేక మంది పుస్తక పఠనం ద్వారా ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. కార్యక్రమంలో టౌన్‌హాల్ హైస్కూల్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరంలోని గ్రంథాలయంలో లైబ్రేరియన్ టి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు, ప్రభుత్వోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కన్నూరి సతీష్‌బాబు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు సత్యం రమేష్‌బాబు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధవళేశ్వరం గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు 300మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. శనివారం స్కూల్ ప్రాంగణంలో డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేసి 30 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం

రంగంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. హాస్టల్‌లో ఉండి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన కొమ్మూరి వెంకటఅర్జున్ శుక్రవారం మధ్యాహ్నం హాస్టల్ నుంచి ఆడుకోవడానికి అని చెప్పి బయటకి వెళ్లి తిరిగి రాలేదని వార్డెన్ రామకృష్ణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన అనపర్తి సీఐ సుమంత్‌తో చర్చించారు. దీనిపై కేసు నమోదు చేసి రెండు పోలీసుల బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నామని, హాస్టల్ సిబ్బంది కూడా దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

బీజేపీ బూత్‌స్థాయి కమిటీల నియామకం

రంగంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో బూత్‌స్థాయి కమిటీల నియామకం శనివారం బీజేపీ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శివరామకృష్ణంరాజు ప్రారంభించారు. మండలంలో ఎస్టీరాజాపురం, రంగంపేట, పెదరాయవరం, వెంకటాపురం, చంద్రేడు గ్రామాల్లో పూర్తిస్థాయి బూత్ కమిటీలను వేశామని బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరామ్ తెలిపారు. దీనికి ఆర్‌వోగా మద్దిపాటి రజని, ఏఆర్వోలుగా మండవిల్లి గుప్త, తోట సూర్యభాస్కర్‌రావుల సమక్షంలో నియామకాలు జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

గన్నిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణను ఉభయగోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన స్థానిక కంబాలచెరువు వద్ద కార్యాలయంలో గన్ని కృష్ణ, పేరాబత్తులు ఇద్దరు కొద్దిసేపు ఎమ్మెల్సీ ఓట్లు నమోదు ప్రక్రియపై చర్చించుకున్నారు. ఓట్ల నమోదుకు కృషి చేసిన గన్ని కృష్ణకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

డిమాండ్లను నెరవేర్చాలి

సర్పంచ్‌లకు 104 సిబ్బంది వినతి



రంగంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను నెరవేర్చాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 104 సిబ్బంది మండలంలోని వడిశలేరు సర్పంచ్ కొల్లాటి శ్యామలావతికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సకాలంలో వేతనాలు ఇవ్వలేదన్నారు. 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈవోకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్మును తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్టు చెప్పారు. అలాగే సింగంపల్లిలో సర్పంచ్ తుట్టా శివశంకర్ ఆనంద్‌కు 104 సిబ్బంది వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గొర్రెల కాంతారావు, లంక హరి, బత్తిన అనిల్ కుమార్, గొళ్లవిల్లి మోహన్ పాల్గొన్నారు.

వంగలపూడిలో నిలిచిన ఇసుక రవాణా

సొమ్ములు గిట్టుబాటు కావడం లేదని కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు నిరసన



ర్యాంపు వద్ద నిరసన తెలుపుతున్న ట్రాక్టర్ డ్రైవర్లు

సీతానగరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వంగలపూడి ఇసుక ర్యాంపు నుంచి శనివారం ఇసుక రవాణా నిలిచిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంగలపూడి ఇసుక ర్యాంపులో ఇసుక కూలీలతో ఇసుక తవ్వకాలు జరిపి ట్రాక్టర్లలో లోడింగ్ చేసుకుని స్టాక్‌పాయింట్‌కు చేర్చవలసి ఉంది. ఇందుకు గాను కూలీలకు రూ.200 ట్రాక్టర్‌కు రూ.150 యాజమాన్యం చెల్లిస్తోంది. అయితే ఆ సొమ్ము గిట్టుబాటు కావడం లేదని , కూలిపని కూడా రావడం లేదని కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, ట్రాక్టర్ యజమానులు నిరసనకు దిగడంతో ఇసుక స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక చేరకపోవడంతో స్టాక్ ఉన్నంత వరకు ఇసుక రవాణా జరిగినా స్టాక్ పాయింట్ వద్ద ఇసుక అయిపోవడంతో రవాణా నిలిచిపోయింది. ట్రాక్టర్‌కు రూ.200, కూలీలకు రూ.250 ర్యాంపు నిర్వాహకులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ర్యాంపు నిర్వాహకులు శనివారం కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో సంప్రదింపులు జరపకపోవడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది

జీవో 117 రద్దుపై హర్షం

ధవళేశ్వరం,నవంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యకు ఆటంకంగా మారిన జీవో 117 రద్దుపై టీడీపీ నాయకుడు యర్రమోతు ధర్మరాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తూ 117జీవో అమలు చేయడం ద్వారా ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమయ్యాయని జీవో 117ను రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్‌కు యర్రమోతు ధర్మరాజు లేఖ ద్వారా తెలియపరిచారు. జీవో 117తో ప్రాథమిక పాఠశాలలు మూతపడగా విద్యార్థులు సమీపంలోని ప్రైవేట్ పాఠశాలలో చేరారన్నారు. ప్రాథమిక విద్యకు ఆటంకంగా మారిన జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలకు జీవం పోయాలని అప్పటి లేఖలో కోరారు.

బాలికపై అత్యాచారం

యువకుడిపై పోక్సో కేసు

చాగల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ కె.నరేంద్ర వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక సమిశ్రగూడెం ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. బాలిక ఆధార్ కార్డులో మార్పులు చేయడం కోసం తీసుకురమ్మని ఆమె అమ్మమ్మ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పట్టింపాలెం గ్రామానికి చెందిన 22ఏళ్ల సనమంత్ర కమల్‌ను పంపించింది. బాలికకు మేనమామ వరసయ్యే ఆ యువకుడు హాస్టల్‌కు వచ్చి బాలికను తీసుకుని దారవరంలోని అతడి అమ్మమ్మ ఇంటింటి తీసుకొచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైన చెబితే చంపేస్తానని బెదిరించి బాలికను అమ్మమ్మ ఇంటి వద్ద అప్పగించాడు. జరిగిన ఘటనను బాలిక ఆమె అమ్మమ్మకు చెప్పడంతో శుక్రవారం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. వైద్యసేవల అనంతరం బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



కాపవరంలో గ్రామస్తులకు సైబర్ మోసాలను తెలుపుతున్న ఎస్ఐ రవిచంద్రకుమార్

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

అనపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల సైబర్ నేరాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. శనివారం అనపర్తిలోని వర్తక సంఘం కల్యాణ మండపంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు చెందిన బ్యాంక్ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన పెంచాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంతో పాటు బ్యాంక్ అధికారులపై ఉందన్నారు. నేరం జరిగిన వెంటనే స్పందిస్తే కొంత మేర వినియోగదారుడికి మేలు జరిగే వీలున్నందున అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంక్ అధికారుల సహకారం అవసరమన్నారు. సమావేశంలో ఎస్ఐ శ్రీను నాయక్, పలు బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన బలభద్రపురం, కాపవరం గ్రామాల్లో ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురి కాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, గురైతే పోలీసులకు ఎలా ఫిర్యాదు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో చట్ట వ్యతిరేక పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



పోటీలకు ఎంపికైన పొలమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

అనపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల్లో అనపర్తి మండలం పొలమూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఆర్.విజయదుర్గ తెలిపారు. అండర్ 17 పవర్ లిఫ్టింగ్ విభాగంలో వానపల్లి వెంకట శ్రీరామ్ 53 కిలోల విభాగంలో, మేడపాటి సంకీర్తనాదేవి 69 కిలోల విభాగంలో, కర్రి దనుష్‌రెడ్డి 83 కిలోల విభాగంలోను రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. అండర్ 14 టేబుల్ టెన్నిస్ విభాగంలో పెంకే వీరవెంకట సత్యనారాయణ ఎంపికైనట్లు ఆమె తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎమ్‌తోపాటు పిడీ సూర్యప్రభాకరరెడ్డి, మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వాసంశెట్టి నాగేశ్వరరావు, కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, ద్వారంపూడి ఈశ్వర రెడ్డి, కొవ్వూరి వెంకటరెడ్డి (శ్రీను) తదితరులు అభినందించారు.

రామ్మూర్తినాయుడు మృతికి ఎమ్మెల్యే నల్లమిల్లి సంతాపం

అనపర్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంతాపం తెలిపారు. రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు.

వీజే కళాశాలకు బహుమతులు

దివాన్‌చెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కంప్యూటేషనల్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషనల్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్సీ అంశంపై జరిగిన జాతీయ సదస్సులో తమ కళాశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుందని దివాన్‌చెరువులోని వీజే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర తెలిపారు. ఆదిత్య కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో తాను కేర్‌మేస్ట్రో అవార్డును, అధ్యాపకుడు కేవీ నాగలక్ష్మి ఓరల్ ప్రజెంటేషన్‌లో ప్రథమ బహుమతి అందుకున్నామని ఆయన తెలిపారు. విద్యార్థులు ఎం.పుష్పలత, జి.అమూల్య ఎస్.మేఘన, ఎండీ రవూఫ్, జి. దుర్గాప్రసాద్ వివిధ పోటీల్లో బహుమతులు పొందారని చెప్పారు.

మనకూ ఒకరోజు కావాలి.. మన నచ్చినట్టు ఉండాలి.. పదిమందితో కలిసి ఆనందంగా గడపాలి.. గంతులు వేయాలి.. ఆటలు ఆడాలి.. పాటలు పాడాలి.. డ్యాన్స్ చేయాలి.. ఆ రోజంతా ఖాళీగా గడపాలి.. ఇలా ఏడాదికి ఓ రోజు.. చాలు ఏడాదంతా జ్ఞాపకం చేసుకుంటూ బతికేస్తాం.. ఇదీ ప్రస్తుత తరం ఆలోచన. ఎందుకంటే బిజీ జీవితం.. తీవ్ర ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు.. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకూ పరుగులే.. ఎక్కడా ఖాళీ ఉండదు.. సాయంత్రానికి ఖాళీగా కూర్చుని ఆలోచిస్తే ఇంతేనా జీవితం అనిపిస్తుంది.. ఎందుకంటే ప్రస్తుతం ఉమ్మడిగా చేసుకునే పండుగల్లేవ్.. సరదాగా కలుసుకునే సందర్భాల్లేవ్.. వచ్చామా.. వెళ్లామా అంతే.. అందుకే కార్తీక మాసం సందర్భంగా ఏడాదికో మారు పిక్నిక్ పెట్టుకుంటున్నారు.. కుటుంబీకులు, స్నేహితులు కలిసి రీఫ్రెష్ అవుతున్నారు.. మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాల అని ముత్యాల ముగ్గు సినిమాలో రావుగోపాలరావు అన్నట్టు.. ఆ రోజంతా తమ కళాపోషణ బయటపెడుతున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపి బై బై చెప్పుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.. ఆనందంగా గడిపేందుకు మనకు ఎన్నెన్నో అందమైన పిక్నిక్ స్పాట్‌లు ఉన్నాయి.. అవేంటో ఒకసారి చూసేద్దాం!


అంతర్వేది

ఆదివారం ప్రత్యేకం


కడియం పూలసోయగం

ఆంధ్రా కేరళ కోనసీమ

పచ్చని అందాలకు నెలవు కోనసీమ.. ఎటుచూసినా పచ్చదనమే.. ఏవైపు చూసినా పిక్నిక్ స్పాట్‌గానే ఉంటుంది.. ఎందుకంటే ఆంధ్రా కేరళ.. ఎత్తయిన కొబ్బరిచెట్లు.. పచ్చదనంతో నిండిన చేల మధ్య నుంచి నల్లటి తారు రోడ్లపై వెళుతుంటే ఆ అనుభూతే వేరు.. కేశవదాసుపాలెం, కేశనపల్లి, ఓడలరేవు, వాసలతిప్ప, ఎస్.యానాం బీచ్‌లతో పాటు గోదావరి తీరప్రాంతాలైన యానాం, కోటిపల్లి, ముక్తేశ్వరం, ఆదుర్రు, సోంపల్లి, దిండి రిసార్ట్స్, లొల్లలాకులు తదితర ప్రాంతాలు పిక్నిక్ స్పాట్‌లుగా ప్రసిద్ధికెక్కాయి. వీటితోపాటు ఆధ్యాత్మిక ప్రాంతాలైన అంతర్వేది, అప్పనపల్లి, అయినవిల్లి, మురమళ్ళ, వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. కోనసీమకు ఓవైపు గోదావరి.. మరోవైపు బీచ్ ఉండడం గమనార్హం. కోనసీమకు వెళ్లేందుకు రావులపాలెం, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మీదుగా బస్ సౌకర్యం ఉంది. రావులపాలెం మీదుగా అంతర్వేదికి 65 కి.మీ. ఓడలరేవు అయితే 51 కి.మీ.. పాలకొల్లు నుంచి అంతర్వేది అయితే 26 కి.మీ ఉంటుంది.


ఓడలరేవు


తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో శనివారం మహిళల పిక్నిక్ సందడి

'తూర్పు'న అందాలు

అన్ని అందాలు కలగలిపినదే తూర్పుగోదావరి జిల్లా.. ఒకవైపు గోదావరి.. మరోవైపు కడియం పూలతోటలు.. ఇంకోవైపు కోరుకొండలో పాండవుల మెట్ట.. గోకవరంలో సూదికొండ.. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద కాటన్‌మ్యూజియం, గోదావరి అందాలు.. పెరవలి మండలం తీపర్రు గోదావరి చెంతనే ఇసుక తిన్నెలు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నోఎన్నెన్నో.. ఇక రాజమహేంద్రవరం పట్టణవాసులకు అయితే నగరంలో దివాన్‌చెరువు వద్ద ఉన్న పుష్కరవనం.. లోపలకు వెళితే మళ్లీ రావాలనిపించదు. ఎందుకంటే చుట్టూ చెట్ల మధ్యన పిక్నిక్ అద్భుతం.. బిజీ జీవితం గడిపే పట్టణవాసులకు ఈ పుష్కరవనం ప్రత్యేకమనే చెప్పాలి. ఎందుకంటే ఒకటా రెండా సుమారు 250 ఎకరాలపైనే ఈ పార్కు విస్తీర్ణం. ఒక 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలు ఉంటాయి. తరువాత ఎటు చూసినా పచ్చనిచెట్లు గుబురుగా గుబురుగా పెరిగి ఉంటాయి. తూర్పుగోదావరి జిల్లాలో పిక్నిక్ స్పాట్లకు రాజమహేంద్రవరం నగరం నుంచి ప్రత్యేకంగా బస్ సౌకర్యం ఉంది.. ఇక రాజమహేంద్రవరం రావడానికి విమానయానం, రైలు, బస్ తదితర సదుపాయాలు ఉన్నాయి.

రారండోయ్.. చూసొద్దాం!



ఉమ్మడి జిల్లాలో ఎన్నెన్నో అందాలు

(కాకినాడ/ అమలాపురం/ రాజమహేంద్రవరం సిటీ/ దివాన్‌చెరువు/ కడియం/పెరవలి, ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పిక్నిక్‌ల సందడి నెలకొంది. కార్తీక మాసం కావడంతో ఎక్కడికక్కడ జనం గార్డెన్ పార్టీలతో సందడి చేస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలు, వివిధ సామాజికవర్గాలు, కార్మిక సంఘాలు, ఉద్యోగ యూనియన్లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు ఎవరికివారే పిక్నిక్‌ల బాటపడుతున్నారు. ఆదివారం రోజైతే ఉమ్మడి జిల్లాలో మామిడి, కొబ్బరి తోటలు, గోదావరి గట్లు, పార్కులు పిక్నిక్‌లతో సందడిగా మారుతున్నాయి. కాకినాడలో అయితే సర్పవరం జంక్షన్, ఇంద్ర పాలెం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, తునిరూరల్‌లోని అనేక ప్రైవేటు గార్డెన్లు, గెస్ట్‌హౌస్‌లు, కొబ్బరితోటల్లో పిక్నిక్‌లు భారీగా జరుగు తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో ప్రధానంగా రాజమహేంద్రవరం, కడియం, రాజానగరం తదితర ప్రాంతాల్లో తోటలు, నర్సరీలు గోదావరి ఇసుక తిన్నెలు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరితోటలు, సముద్రతీరం వెంబడి, గోదావరి పాయల వెంబడి ఇసుక మధ్యలో సరదాసరదాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సామాజికవర్గాల వారీగా నిర్వహించే పిక్నిక్‌లు అయితే ఓ భారీ ఈవెంట్‌నే తలపిస్తాయి. డీజేలు, సినిమా నటులతో డ్యాన్సులు, స్థానిక కళాకారులతో స్టెప్పులు, ఆటపాటలతో సందడి చేస్తారు. ప్రధానంగా కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలో కొన్ని సామాజికవర్గాలు రెండు వారాలుగా భారీస్థాయిలో వీటిని నిర్వహిస్తున్నాయి. కాకినాడలో ఓ కీలక సామాజికవర్గ పిక్నిక్‌లో ఆటపాటల్లో గెలిచినవారికి కారు, బైక్‌లు కూడా గిఫ్టులుగా అందిస్తున్నారు. మిమిక్రీ, కామెడీ పండించే కళాకారులను సైతం పిలిపిస్తున్నారు. కోనసీమ జిల్లాలో తోటల్లో నిర్వహిస్తోన్న పిక్నిక్‌ల్లో సరదాగా కార్డులతోపాటు ఉత్తుత్తి కోడిపందేలు నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పిక్నిక్‌ల సందడి హోరెత్తిస్తోంది. మరోపక్క కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, శంఖవరం మండలాలు, యానాం వద్ద గోదావరి అందాలు, ఏజెన్సీలో మారేడుమిల్లి, చింతూరు, రంపచోడవరం తదితర ప్రాంతాల్లో జలపాతాల వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు వాటర్‌ఫాల్స్ మరింత శోభాయమానంగా మారి పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి.

ఆహా.. ఏమి రుచి..అనరా..

పిక్నిక్ అంటే విందు కీలకం. వెజ్, నాన్‌వెజ్ భోజనాల్లో రకరకాల కమ్మటి వంటలు వేడివేడిగా తినడం అదో ఆనందం. ఈ నేపథ్యంలో పిక్నిక్‌లకు కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలలో కొన్ని హోటళ్లకు భారీ వెజ్, నాన్‌వెజ్ భోజనాల ఆర్డర్లు వస్తున్నాయి. కాకినాడలో ఓ ప్రముఖ వెజ్ హోటల్ ఆదివారం రోజైతే లగేజీ ఆటోల్లో తుని వరకు, ఆ చివరన యానాం వరకు పది నుంచి పదిహేను పిక్నిక్ గ్రూపులకు భోజనాలు అందిస్తున్నాయి. నాన్‌వెజ్ కేటరింగ్‌లకు సైతం గిరాకీ భారీగా ఉంది. రకరకాల నాన్‌వెజ్ వంటకాలు వండి పిక్నిక్ స్పాట్‌ల వద్దకు చేర వేయడం, పిక్నిక్ జరిగే ప్రదేశంలోనే భారీ వంటకాలు సైతం కొందరు చేయించుకుంటు న్నారు. కొందరైతే గోదావరి సమీపంలో పిక్నిక్‌లు చేసుకుంటూ లైవ్ ఫిష్ వండించుకుతింటున్నారు. దీంతో ఆదివారం వస్తే కేటరింగ్ సంస్థలకు భారీ ఆర్డర్లు వస్తున్నాయి. వెజ్‌లో పది రకాల ఐటమ్స్‌కు ప్లేటుకు రూ.250 నుంచి వసూలు చేస్తుండగా, నాన్‌వెజ్ అయితే రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. పిక్నిక్‌లో సుష్టిగా భోజనం చేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

హరితవనం.. కడియం





కడియం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మనం ఒకటి రెండు రకాలు పూలు చూస్తేనే ముచ్చట పడిపోతాం.. అటువంటిది వందలాది రకాల పూలమొక్కలు విరబూస్తూ ఓ చోట కనిపిస్తే ఆ సుందర దృశ్యం చూడతరమా.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో నర్సరీల పూలకొలువు. మండలంలో పది గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో 1100 నర్సరీలు ఉన్నాయి. ఇక్కడ పూలు, పండ్లు, ఆర్నమెంటల్, ఔషధ, సెమిషేడ్, క్రీపర్, ఇండోర్, ఔట్‌డోర్, హేంగింగ్ వంటి రకాల మొక్కలు అనేకం ఉంటాయి. కార్మికుల శ్రమ సౌందర్యంతో విరజిల్లే మొక్కలు ఆకుపచ్చని విన్యాసం చేస్తూ పర్యాటకులకు ప్రణమిల్లుతాయి. ప్రకృతి ఒడిలో హరిత శోభగా గోదావరి నదిఒడ్డున వెలసిన కడియం పూలసీమలో ఈ కార్తీక వేళ సేదతీరి ఉసిరిచెట్టు కింద సహపంక్తి వన భోజనాలు చేయడానికి అనేక మంది ఇష్టపడతారు. కడియపులంక జాతీయ రహదారిని అనుకుని ఉంటుంది. రాజమహేంద్రవరం నుంచి 13 కి.మీ ప్రయాణం చేస్తే కడియం చేరుకోవచ్చు. రావులపాలెం మీదుగా అయితే 23 కి.మీ ఉంటుంది. నిరంతరం బస్, ఆటోలు ఉంటాయి.


కాకినాడ బీచ్




తీపర్రు గోదావరి తీరం..

ప్రకృతి చుట్టూ కాకినాడ

చుట్టూ అందాలు.. మధ్యలో కాకినాడ జిల్లా.. ఒకప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం ఇది.. ఒకవైపు చూపరులను కట్టపడేసే అందమైన ఏజెన్సీ.. మరోవైపు కాకినాడనే ఆనుకుని ఉన్న మడ అడవులు.. ఇంకోవైపు యానాం.. మరోవైపు పచ్చని కోనసీమ.. ఇక అందరినీ ఆకట్టుకునే కాకినాడ బీచ్.. ఇంతేనా అనుకోవద్దు.. ఏజెన్సీలో విహరిద్దామని అనుకుంటే ఒకటా రెండా ఏకంగా 8 జలపాతాలు ఉన్నాయి. అన్నీ జలకళతో పర్యాటకులను రారమ్మని పిలుస్తున్నాయి. మరోవైపు అందాల యానాం ఆస్వాదించేందుకు రమ్మంటుంది.. మడ అడవులను తిలకిస్తే ఆ ఆనందమే వేరు.. కాకినాడ జిల్లాకు ఎటు చూసినా అందమే మరి.. ఒకసారి ఆ అందాన్ని ఆస్వాదిద్దాం.. కాకినాడ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్ సౌకర్యం ఉంది. ఏజెన్సీలోని జలపాతాల వద్దకు వెళ్లాలంటే సొంత వాహనం లేదంటే అద్దెకు మాట్లాడుకుని అయినా వెళ్లాల్సిందే.

తీపర్రు తీరం..ఆహ్లాదం

లాలాచెరువు సమీపంలో జాతీయరహదారిని ఆనుకుని దాదాపు 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోదావరి మహా పుష్కరవనం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. పుష్కరవనంలో ప్రత్యేకించి కార్తీకవనం కూడా ఉంది. ఇందులో దాదాపు 80 వరకూ ఉసిరి చెట్లు ఉంటాయి. ఈ పుష్కరవనంలో వనభోజనాలు చేయాలంటే పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.10 వంతున ప్రవేశరుసుంగా చెల్లించాలి. పెరవలి మండలం తీపర్రులో గోదావరి తీరం ప్రకృతి రమణీయతకు నిదర్శనంగా ఉంటుంది. పచ్చని చేల మధ్య విహారం..ఆహ్లాదమే మరి..



వైసీపీ సోషల్ మీడియా మూకలను వదలొద్దు

- నాడు నా భార్యపైనా ట్రోలింగ్స్
- అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. అసెంబ్లీ సమావేశంలో శనివారం కొన్ని ప్రధాన సమస్యలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ పాలనలో కల్తీ మద్యం మృతులపై అసెంబ్లీలో తన భార్య అప్పటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని మాట్లాడితే తన కుటుంబంపైన దారుణంగా ట్రోల్ చేసిన వైసీపీ మూలకపై కఠినచర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. గత ఐదేళ్లలో టీడీపీ, జనసేనలో యాక్టివ్‌గా ఉండే కీలకమైన నాయకులపై వైసీపీ సోషల్ మీడియాలో అసభ్యకర,అభ్యంతరకర పోస్టులతో ఇబ్బంది పెట్టారని తెలిపారు. రాజమహేంద్రవరంలో మొదటి దిశ పోలీస్ స్టేషన్ అంటూ ఆర్భాటంగా ప్రారంభించగా నాటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఆ స్టేషన్‌లో తనపై జరిగిన దుష్ప్రచారంపై మొదటి కేసు నమోదు చేయిస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

ఇళ్ల లబ్ధిదారులకు వాట్సాప్ గ్రూప్ పెట్టండి

కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

రాజానగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల నిర్మాణం ఈ డిసెంబరు చివరి నాటికి పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజానగరం మండలం వెలుగుబంద పంచాయతీ పరిధిలోని హౌసింగ్ లేఅవుట్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి శనివారం పరిశీలించి మాట్లాడారు. డిసెంబరు నెల చివరి నాటికి 2,333 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటివరకు 306 (13 శాతం) పూర్తి చేయడం జరిగిందన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆప్షన్ 3 కింద 3,396 ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 683 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పునాది స్థాయిలో 56, బేస్‌మెంట్ పూర్తిచేసినవి 125, మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రతి వారం లక్ష్య సాధన దిశగా కృషి చేయాలన్నారు. లబ్ధిదారులతో కూడిన వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చెయ్యాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. బిల్లుల చెల్లింపు కోసం జియో ట్యాగింగ్ సమస్య ఉందని, వారికి సరైన విధానంలో మార్గదర్శకం చేయాలన్నారు. లబ్ధిదారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఆదివారం ఒక్కరోజు లబ్ధిదారుల అర్జీలకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారులు ఉండడం వల్ల కార్పొరేషన్ సిబ్బంది సహకారం అందించాలని ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ కెఎల్ శివజ్యోతి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ.గిరి, ఇతర జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

కలెక్టరేట్‌కు స్థల పరిశీలన

రాజమహేంద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టరేట్ శాశ్వత భవనాల నిర్మాణానికి జాంపేటలోని పోలీసు క్వార్టర్ సమీపంలోని స్థలాలను కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం అధికారులతో కలసి పరిశీలించారు. జిల్లాలు ఏర్పడి వచ్చే ఏప్రిల్ 2వ తేదీకి మూడేళ్లు పూర్తవుతునాన ఇప్పటి వరకు కలెక్టరేట్‌కు శాశ్వత భవనాలు లేవు. ప్రస్తుతం బొమ్మూరులోని నేక్ భవనాల్లోను, ఇతర భవనాల్లోను కార్యాలయాలు ఉన్నాయి. సొంత భవనాల నిర్మాణానికి జీవో జారీ అయ్యింది.ఈ నేపథంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి జాంపేట స్వామి థియేటర్ ఎదురుగా ఉన్న సుమారు ఏడు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.కలెక్టరేట్‌తో పాటు ఇతర కార్యాలయాలు శాశ్వతంగా నిర్మిస్తామన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సభ్యులు

రాజానగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ పరిధిలో నడుస్తోన్న అంగన్‌వాడీ మినీ సెం టర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని కోరుతూ రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయ ప్రాం గణంలో శనివారం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి బేబిరాణి శనివారం వివరాలు వెల్లడిం చారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ మినీ వర్కర్స్ అనేక సేవలందిస్తున్నారన్నారు. మినీ వర్కర్లకు ప్రమో షన్లు కల్పించాలని జీవో ఉన్నప్పటికి సక్రమంగా అమలు కావడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించా లని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్ వాడీ సంఘ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ,సీఐటీయు ఉపాధ్యక్షుడు పి.పవ న్, ఎస్ ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాయవరం పీహెచ్‌సీలో సేవలపై ఆరా

నేషనల్ హెల్త్ రిసోర్స్ సెంటర్ వైద్య బృందం తనిఖీలు

అనపర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రామవరంలోని పీహెచ్‌సీలో ఢిల్లీలోని నేషనల్ హెల్త్ రిసోర్స్ సెంటర్ వైద్య బృందం ఆధ్వర్యంలో శుక్ర,శనివారాలు తనిఖీలు చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, వైద్య సేవలు, పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది పనితీరు వంటి అంశాలపై వివరాలు సేకరించారు.బృందంలోని వైద్యులు శశికళ, కల్పన ఆధ్వర్యంలో వైద్యుల బృందం ఆసుప త్రిని క్షుణ్ణంగా పరిశీలించారు.రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించిన ఆసుపత్రుల్లో పనితీరు మెరుగ్గా ఉన్న ఆసుపత్రులను ఎంపిక చేసి రూ.50 లక్షల ఆసుపత్రి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు.వైద్య బృందం తనిఖీలకు వస్తున్న సమాచారాన్ని పది రోజుల ముందుగానే తెలియజేయడంతో బృందం వచ్చే సరికి సిబ్బంది ఆసుపత్రిని సుందరంగా తీర్చిది ద్దారు.ఇలా కాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వ హిస్తే సమస్యలను గుర్తించే అవకాశం పూర్తి స్థాయిలో ఉండేదని ప్రజలు అంటున్నారు.ఆసుపత్రి వైద్యాధికారి సుమతీదేవి పీహెచ్‌సీ పరిధి లో సేవలను వివరించగా సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ కోఆర్డినేటర్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కోఆర్డినేటర్లను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి తెలిపారు.రాజమహేంద్రవరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా కొండ్రా జు,అనపర్తి కృష్ణచైతన్య రెడ్డి, కొవ్వూరు రసూల్,నిడదవోలు కోరంకి వెంకటేశ్వరరావు, రాజానగరం డాక్టర్ శ్రీనివాస్ వడయార్, గోపాలపురం కోఆర్డినేటర్ మార్టిన్ లూథర్‌లను నియమించినట్లు తెలిపారు.రాజమహేంద్రవరం సిటీ కోఆర్డినేటర్‌గా తాను వ్యవహరిస్తానని తెలిపారు.

గోదావరిలో దిగి.. చచ్చిపోదామని..

వయోభారం తాళలేక వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన స్థానికులు.. పోలీసులకు అప్పగింత

కొవ్వూరు,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వయోభారం వృద్ధులకు శాపంగా మారుతోంది.. కొంత మంది చూసేవారులేక..మరికొంత మంది చూసేవారున్నా అనారోగ్య సమస్యల కారణంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు..కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శనివారం జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజవోలు గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యనారాయణ(78) మూడు సార్లు సొసైటీ ప్రెసిడెంట్‌గా పనిచేశాడు.ఆయనకు ఇద్దరు కుమారులు..ఒక కుమార్తె.చాలా కాలం కిందట ఇద్దరు కుమారులు మరణించడంతో ప్రస్తుతం కుమార్తె వద్ద ఉంటున్నాడు.అయితే గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ఆసుపత్రి ఖర్చుల కారణంగా కుటుంబీకులకు భారం కాకూడదని ఈ నెల 15వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. రాత్రి కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోనే బస చేశారు.శనివారం ఉదయం గోదావరిలో దిగి ఆత్మహత్యాయత్నానికి ప్ర యత్నించగా స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు.ఈ మేరకు పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని సత్యనారాయణను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇదిలా ఉండగా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో శనివారం సత్యనారాయణ అదృశ్య మైనట్టు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు వివరాలు అడిగితెలుసుకుని రాజవోలు నుంచి కుటుంబీకులను రప్పించి అప్పగించారు.


పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

వచ్చే పుష్కరాలకు కమిటీలు : కలెక్టర్ 8

జైలు స్నేహితులు.. చోరీలు చేస్తున్నారు! 7
సాగిపాడు కేసు ఛేదించిన పోలీసులు

బాలికపై అత్యాచారం
చాగల్లులో పోక్సో కేసు నమోదు 8

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

'కొవ్వాడ' ముంపును పరిష్కరించాలి



- కాలువ పూడిక తీతకు నిధులు మంజూరు చేయాలి
- టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వాడ కాలువ ముంపు నుంచి రైతులను కాపాడాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం ఆయన మాట్లాడారు. కొవ్వూరు నియోజకవర్గంలో వర్షాకాలంలో కొవ్వాడ కాలువలోకి వర్షపునీరు చేరి కాలువ పొంగి పంటలు ముంపుకు గురై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాలువ డీసిల్టేషన్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. గత ఐదేళ్లలో కాలువలు పూడిపోయి వర్షపునీరు ముందుకు పారక సుమారు 10 వేల ఎకరాలు ముంపుకు గురవుతున్నాయన్నారు. అలాగే 2014-19 టీడీపీ ప్రభుత్వంలో కొవ్వూరు మున్సిపాల్టీలో 480 టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టిందని, నిర్మాణం పూర్తయ్యేసరికి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గృహాలను లబ్ధిదారులకు అందించలేదన్నారు. లబ్ధిదారులంతా పేదవారని, అప్పులు చేసి తెచ్చారని, ఆ డబ్బుకు వడ్డీతో పాటు, ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రస్తుతం 80శాతం నిర్మాణాలు పూర్తయ్యాయని, ఎన్నికల హామీ మేరకు లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పీఎంపీల సేవలు అభినందనీయం



దేవరపల్లి మండల పీఎంపీల నూతన కమిటీ

దేవరపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో ప్రాథమిక వైద్యం అందించడంలో పీఎంపీల సేవలు అభినందనీయమని పీఎంపీల జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు అన్నారు. దేవరపల్లిలో విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో శనివారం రాజమహేంద్రవరంలోని గంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యం లో అవగాహన సదస్సు, పీఎంపీల మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా గంగా ఆసుపత్రి డాక్టర్ పరమహంస, స్పందన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు వైద్య సేవలందించడంలో పీఎంపీలు మరువలేనిదన్నారు. పీఎంపీల అసోసియేషన్ మండలాధ్యక్షుడిగా ఆకుల నాగేశ్వరరావు, కార్యదర్శిగా దాసరి సత్యభాస్కరరావు, కోశాధికారిగా ప్రసాదరాజు, ఉపాధ్యక్షుడిగా మామిడిపల్లి వెంకట్రావు, సహాయ కార్యదర్శిగా మండలపు బాలసుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడిగా చాపల కామరాజు, మరో ఆరుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కాగా జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా దేవరపల్లిలోని విలేకర్లను పీఎంపీలు సన్మానించారు.

వరి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలి



దేవరపల్లిలో ధాన్యం రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సీపీఎం, రైతు సంఘం నాయకులు

దేవరపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాష్‌చంద్రబోస్ కోరారు. మండలంలోని త్యాజంపూడి, గౌరీపట్నం, కృష్ణంపాలెం, పల్లంట్ల గ్రామాల్లో ధాన్యం రైతుల కళ్లాల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు, సుభాష్‌చంద్రబోస్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై రైతులను వివరాలు అడగ్గా మద్దతు ధర రూ.1725 ఇవ్వాల్సి ఉండగా ధాన్యం తేమతో ఉందని తేమశాతాన్ని చూపించి బస్తాను రూ.1420కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం వల్ల దిగుబడి పెరగడం లేదని, దానికి తగ్గట్టు పురుగుమందులు, ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు ప్రకారం పెట్టుబడి 50శాతం కలిపి ధరను నిర్ణయించి ఆ రైతుకు వచ్చేలా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ.900 బోనస్‌గా ఇస్తోందని, మన రాష్ట్రంలో కనీసం రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలవ్వాలి



నిడదవోలులో రామ్మూర్తి నాయుడు మృతికి నివాళులర్పిస్తున్న శేషారావు, నాయకులు

నిడదవోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలు జరిగేలా అధికార్లు చర్యలు చేపట్టాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. శనివారం నిడదవోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం భవన నిర్మాణ కార్మికులతో పాటు అన్ని వర్గాల వారికి పని కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇసుకపై వచ్చే ఆదాయాన్ని వదులుకోవడం ద్వారా ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లోడింగ్ ట్రాన్స్‌పోర్టు చార్జీలు తప్ప అదనంగా ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా జిల్లా అధికార్లు చర్యలు చేపట్టాలన్నారు. తమ దృష్టికి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ప్రభుత్వ యంత్రాంగం ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

రామ్మూర్తి నాయుడు మృతికి నివాళి

టీడీపీ నాయకుడు, పారిశ్రామికవేత్త, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతి పార్టీకి తీరని లోటని బూరుగుపల్లి శేషారావు అన్నారు. పార్టీ కార్యాలయంలో రామ్మూర్తినాయుడి మృతికి నివాళులర్పించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని సేవలందించారన్నారు. కార్యక్రమంలో వెలగన సూర్యారావు, తిరుపతి సత్యనారాయణ, కారింకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటారుసైకిళ్లు ఢీ
నలుగురికి తీవ్ర గాయాలు



గోదావరి గట్టుపై ఢీకొన్న వాహనాలు

తాళ్లపూడి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి గోదావరి గట్టుపై శుక్రవారం రాత్రి రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఒక మోటారు సైకిల్‌పై తాళ్లపూడి నుంచి ప్రక్కిలంక గ్రామానికి చెందిన బొద్దేపల్లి వీరన్న, సంగాడి దుర్గాప్రసాదు, మరో మోటారుసైకిల్‌పై పోలవరం మండలం పట్టిసీమ నుంచి అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, నాగేంద్ర తాళ్లపూడి వస్తున్నారు. ఈ రెండు మోటారుసైకిళ్లు తాళ్లపూడి పుష్కరాల రేవు సమీపంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. కాగా ప్రక్కిలంక గ్రామస్థుల్లో ఒకరిని తాళ్లపూడి స్మార్ట్ హాస్పిటల్‌కు, మరొకరిని రాజమహేంద్రవరంలోని సాయి హాస్పిటల్‌కు తరలించినట్టు సమాచారం. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలుగుదేశం పార్టీలో
వర్గ విభేదాలు
పురుషోత్తపల్లిలో ఓ వర్గంపై దాడి

నిడదవోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం పురుషోత్తపల్లిలోని తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ఉన్న వర్గ విభేదాలు శనివారం భగ్గుమన్నాయి. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు ఒకరు వైసీపీ నాయకులతో కలసి అంతర్గత వ్యవహారాలు చేయడంతో పార్టీలో కోవర్టుగా వ్యవహరిస్తున్నాడంటూ ఒక వర్గం నిలదీసింది. దీంతో తెలుగుదేశం పార్టీలోని ఇరువర్గాలు రోడ్లపై బాహాబాహికి దిగారు. ఒక వర్గం.. మరొక వర్గంపై దాడికి పాల్పడింది. దీంతో కార్యకర్తకు జరిగిన అన్యాయానికి తెలుగు తమ్ముళ్లు నిరసనకు దిగారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు వైసీపీ నాయకులతో కలసి ఉంటూ పార్టీకి అన్యాయం చేస్తున్నాడని అడిగినందుకు కార్యకర్తపై దాడి చేశారంటూ తెలుగు తమ్ముళ్లు మధ్యాహ్నం నుంచి రోడ్డుపైనే ఉంటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై చేయి చేసుకున్న ఆ పార్టీ నాయకుడిపై పార్టీ అధినాయకత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్నా చేస్తున్నారు. ప్రస్తుతం పురుషోత్తపల్లిలో తెలుగుదేశం పార్టీలో భగ్గుమన్న విభేదాలతో ఒక వర్గం నిరసన ధర్నా కొనసాగిస్తోంది.

'కోడ్' కూసినా..
ముసుగు పడలేదు!



గోపాలపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉందో లేదో అనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ప్రకటించింది. దీని ప్రకారం రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగువేయాలి. అయితే కోడ్ అమలులోకి వచ్చి సుమారుగా 12రోజులు కావస్తున్నా అధికారులు పట్టీపట్టనట్టు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. గోపాలపురం ప్రధాన సెంటర్‌లో ఇబ్బడి ముబ్బడిగా పలు పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు తొలగించలేదు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయలేదు. బహుశా వాటికి కోడ్ వర్తించదేమో అనే ఊహాగానాలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికారులు స్పందించి కోడ్‌ను అమలు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

- విచారణ చేపట్టాలి
- రెవెన్యూ మంత్రి అనగానికి ఎమ్మెల్యే మద్దిపాటి వినతి



మంత్రి అనగానికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములతో పాటు ఇతర భూములపై విచారణ జరిపించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించి మంత్రి భూములపై ఎంక్వయిరీ జరిపించాలంటూ ఓఎస్‌డీని ఆదేశించినట్టు మద్దిపాటి తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశం అనంతరం మంత్రిని క్యాంపు కార్యాలయంలో కలిశామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని బీమోలుతో పాటు పలు గ్రామాల పరిధిలో ఉన్న కొండలకు సంబంధించిన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని గత ప్రభుత్వ హయాంలో అధికారులతో కుమ్మక్కై కొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, వారిపై విచారణ జరిపించాలని కోరామన్నారు. తాను పాదయాత్ర చేసిన సమయంలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి కల్పించాలంటూ తన దృష్టికి తీసుకొచ్చారని, వారందరికి ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మద్దిపాటి అన్నారు.

గ్రంథాలయాలు వినియోగించుకోవాలి

- జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
- అయ్యంకి, గాడిచర్ల, పాతూరిలకు ఘనంగా నివాళులు
- విద్యార్థులకు పాటలు, వక్తృత్వ పోటీలు



కొవ్వూరులో మాట్లాడుతున్న ఉదయశ్రీ

కొవ్వూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను వినియోగించుకుని విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రంథాలయాధికారి జీవీవీఎస్ త్రినాథ్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. దీనికి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల లైబ్రేరియన్ జె.ఉదయశ్రీ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాలయ ఉద్యమం కీలకపాత్ర పోషించిందన్నారు. దేశవ్యాప్తంగా గ్రంథాలయాలు స్థాపించుటకు కృషిచేసి అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయోద్యమ పితామహుడిగా పేరు గాంచారన్నారు. డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ గ్రంథాలయ పంచసూత్రాలను రూపొందించారని, పాతూరి నాగభూషణం చిన్నతనం నుంచి గ్రంథాలయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళడానికి కృషి చేశారన్నారు. అనంతరం విద్యార్థులకు దేశభక్తి గీతాలు, లలితగీతాలు, జానపద గీతాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



చాగల్లులో నివాళులర్పిస్తున్న నాయకులు



దేవరపల్లిలో మాట్లాడుతున్న లైబ్రేరియన్ అనిత

తాళ్లపూడి: తాళ్లపూడి శాఖా గ్రంథాలయంలో సభాధ్యక్షురాలు వేగేశ్వరపురం హైస్కూల్ ఉపాధ్యాయురాలు శిరీష ఆధ్వర్యంలో గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయం ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తుల జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.అనంతరం గ్రంథాలయాల ఉపయోగాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ నరేష్, మలకపల్లి లైబ్రేరియన్ కె.పాపారావు, ఉపాధ్యాయులు రమణ, రాజ్‌కుమార్, నాగభూషణం పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలతో నివాళులర్పించారు. రిటైర్డ్ లైబ్రేరియన్ కుందుల వీరభద్రరావు మాట్లాడుతూ యువకులు, విద్యార్థులు ఖాళీ సమయాన్ని గ్రంథాలయంలో గడిపే విధం గా అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి గడ్డే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. చంద్రవరం శాఖా గ్రంథాలయంలో ఉపాధ్యాయులు ఆర్.రమాంబ, రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంథాలయ సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు దేశభక్తి పాటలు, పద్యాలపై పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.సుమన్‌కుమార్ పాల్గొన్నారు.



తాళ్లపూడిలో అయ్యంకి చిత్రపటానికి నివాళులు

దేవరపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి లైబ్రేరియన్ అనిత మాట్లాడుతూ పుస్తక పఠనంతో మేధాశక్తి పెంపొందుతుందని, ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు వీవీకే రామారావు, ఉపాధ్యాయులు ఎస్.వెంకటేష్, ఈ.గంగరాజు, కిరణ్‌కుమార్, మహిధర్ పాల్గొన్నారు.



తీపర్రు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెరవలి: మండలంలోని తీపర్రు, పెరవలి, ముక్కామల గ్రంథాలయాల్లో డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు లైబ్రేరియన్లు వెంకటేశ్వర్లు, వెంకటజయలక్ష్మి, ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పెరవలిలో ఏడిద సత్యనారాయణ, రామకృష్ణ మాస్టారు, శేషారావు, పాల్గొన్నారు. తీపర్రులో కరుటూరి శ్రీనివాసరావు, హెచ్ఎం పైడికొండల చాముండేశ్వరి, టి.త్రివేణి పాల్గొన్నారు. ముక్కామలలో ఎస్‌వీ సూర్యనారాయణ, గ్రామ కార్యదర్శి అంబటి నాగలక్ష్మి పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ చైరపర్సన్ గుదే సుశీల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్‌ల చరిత్రను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఏవీ రమణ, జి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



నల్లజర్లలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుష్కరాలు-2027కి ప్రత్యేక కమిటీలు: కలెక్టర్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2027 గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ముందస్తు ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం సమీక్షించారు. రాబోయే గోదావరి పుష్కరాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారని, అందుకు అనుగుణంగా నియమించిన కమి టీలన్నీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆయా శాఖల వారీ చేపట్టే పనుల ప్రాధాన్యతానుసారం ఒక్కొక్క కమిటీని నియమిస్తున్నామన్నారు. ట్రాఫిక్, హెల్త్ అండ్ శానిటేషన్, ఫుడ్‌కమిటీ, సర్వేలెన్స్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, పుష్కర నగర్ కమిటీ, డిజాస్టర్ కమిటీ, ప్రొటోకాల్, ఎగ్జిబిషన్, చైల్డ్ అండ్ లేబర్ కమిటీ, టెలీ కమ్యూనికేషన్స్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల పరిధిలో మున్సిపల్ అధికారులు, రూరల్ ప్రాంతాల్లో చేపట్టవలసిన అంశాలపై కొవ్వూరు, రాజమహేంద్రవరం ఆర్డీవోలు ప్రజంటేషన్లు సిద్ధం చేయాలన్నారు. గత పుష్కరాల కంటే 2027 నాటి పుష్కరాలకు ప్రత్యేక బస్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆయా అధికారిక కమిటీలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, కమిషనర్ కేతన్‌గార్గ్, డీఆర్వో సీతారామమూర్తి, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బారావు, టీటీవో ఆర్.సురేష్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, కొవ్వూరు ఇన్‌చార్జి ఆర్డీవో కెఎల్.జ్యోతి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్. కృష్ణనాయక్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టులు



ఉండ్రాజవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ఉండ్రాజవరంలో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు శనివారం స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఉండ్రాజవరం-4 పాఠశాలలో డాక్టర్ ప్రసాద్ పరీక్షలు చేయగా వేలివెన్నులో పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్ స్క్రీనింగ్ టెస్టులు చేశారు. కార్యక్రమాల్లో పీహెచ్‌ఎన్ కేడీఎల్ కుమారి, ఎమ్‌పీహెచ్‌ఈవో ఎండీ ఖాన్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏక సభ్య కమిషన్‌ను
రద్దు చేయాలి
మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ శ్యాం రవిప్రకాష్

కొవ్వూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌పై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. వర్గీకరణపై కమిషన్ వేసే అధికారం రాష్ట్రాలకు లేదని, ఆర్టికల్ 338 ద్వారా నియమించబడిన జాతీయ, రాష్ట్ర ఎస్సీ కమిషన్లు ఉన్నాయని, వాటిని కాదని వేరే కమిషన్‌ను నియమించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా మాలలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. క్రిమిలేయర్ ముసుగులో షెడ్యూల్ కులాలు, తెగల రిజర్వేషన్ తొలగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు.

స్ఫటికలింగానికి
మంత్రుల పూజలు



స్ఫటికలింగాన్ని దర్శించుకున్న మంత్రి సుభాష్

పెరవలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో వేంచేసియున్న శివాలయం వద్ద స్ఫటికలింగాన్ని శనివారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఈ స్ఫటిక లింగ దర్శనాన్ని భక్తులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా భక్తులతో పాటు మంత్రులు సుభాష్, రామానాయుడు స్ఫటికలింగాన్ని దర్శించుకున్నారు. సంవత్సరంలో మూడు సార్లు మాత్రమే దర్శనానికి అవకాశం ఉంటుందని మిగతా రోజుల్లో కోనేరులో ఈ శివలింగాన్ని ముంచి వేస్తామని ఆలయాధికారి తెలిపారు.



లింగానికి మొక్కుతున్న మంత్రి రామానాయుడు

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు
ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి

ఉండ్రాజవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపర్రులో విద్యుదాఘాతంతో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున అందజేయాలని రాష్ట్ర గౌడసంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తాడిపర్రులో మృతుల కుటుంబాలను పరామర్శించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో మృతుల కుటుంబాలకు సేకరించిన విరాళాలను మృతుల కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున, గాయపడిన వ్యక్తికి రూ.30 వేలు సంఘనాయకులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాత కృష్ణారావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడసంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు, కోట రాంబాబు, అత్తిలి బాబి, మట్టా రామకృష్ణ, చిటికిన సూర్యప్రకాష్, కట్టా వెంకటేశ్వరరావు, అబ్బు వెంకటేశ్వరరావు, బత్తిన శ్రీను పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల
రాజీకి సహకరించాలి
9వ అదనపు జిల్లా జడ్జి అనూరాధ



కొవ్వూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి ఇన్సూరెన్సు న్యాయవాదులు సహకరించాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనూరాధ కోరారు. శనివారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్సు న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాత్‌లో కేసులు రాజీ చేసుకోవాలన్నారు. దాని వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా న్యాయవాదులు కోర్టుకు సహకరించాలన్నారు.

టీ తాగేందుకు వెళ్లి..
ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నరసయ్య

పెరవలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై నల్లాకుల వారి పాలెం వద్ద జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్లాకుల వారి పాలేనికి చెందిన నల్లాకుల వెంకట నరసయ్య (45) ఇంటి వద్ద నుంచి బయలుదేరి టీ తాగేందుకు జాతీయ రహదారి దాటుతుండగా తణుకు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య కనకదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బాలికపై అత్యాచారం
యువకుడిపై పోక్సో కేసు

చాగల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ కె.నరేంద్ర వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక సమిశ్రగూడెం ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. బాలిక ఆధార్ కార్డులో మార్పులు చేయడం కోసం తీసుకురమ్మని ఆమె అమ్మమ్మ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పట్టెంపాలెం గ్రామానికి చెందిన 22ఏళ్ల ననమంత్రి కమల్‌ను పంపించింది. బాలికకు మేనమామ వరసయ్యే ఆ యువకుడు హాస్టల్‌కు వచ్చి బాలికను తీసుకుని దారవరంలోని అతడి అమ్మమ్మ ఇంటింటి తీసుకొచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైన చెబితే చంపేస్తానని బెదిరించి బాలికను అమ్మమ్మ ఇంటి వద్ద అప్పగించాడు. జరిగిన ఘటనను బాలిక ఆమె అమ్మమ్మకు చెప్పడంతో శుక్రవారం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లింది. వైద్యసేవల అనంతరం బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

19 నుంచి ఆధార్ క్యాంపులు

కొవ్వూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీలో ఈ నెల 19నుంచి 22 వరకు స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. 19న క్రిస్టియన్‌పేట 2వ సచివాలయం, 20న ఏఎస్ జడ్పీ బాలికల హైస్కూల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, 21న మద్దిపట్ల వారి వీధి 3వ సచివాలయం, 22న ఎన్‌జీవో హోంలోని 7,8 సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.